
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 19 నవంబరు 2024



దివిసీమ ఉప్పెన నాటి హృదయ విదారక దృశ్యం



తీరాన తీరని అలజడి

దివిసీమ ఉప్పెనకు నేటికి 48 ఏళ్లు



పాత ఎడ్లంకలో కృష్ణానది తీరం కోతకు గురికావడంతో గత ఏడాది కూలిన ఇళ్లు

- ఇప్పటికీ తీరంలో భద్రత ప్రశ్నార్థకమే..
- వైపరీత్యాల నుంచి పాఠాలు నేర్వని పాలకులు
- విపత్తుల నిర్వహణపై కొరవడిన శ్రద్ధ
- యథేచ్ఛగా సాగుతున్న పర్యావరణ విధ్వంసం
- వైసీపీ హయాంలో బ్లాక్ శాండ్ పేరిట దోపిడీ
- కరకట్ట సమీపంలో భారీ తవ్వకాలు
- పొలాల్లోకి చొచ్చుకొస్తున్న సముద్రపు నీరు
- కోతకు గురవుతున్న కృష్ణానది తీరప్రాంతాలు
- తీరంలో క్షణక్షణం.. భయంభయం

48 ఏళ్ల కిందటి ఓ రాత్రి.. దివిసీమ చరిత్రలో అదో కాళరాత్రి.. తాడెత్తున ఎగసిన రాకాసి అలలు ఊళ్లకు ఊళ్లను మింగేశాయి.. 10 వేల మందిని పొట్టన పెట్టుకున్నాయి.. అప్పట్లోనే రూ.175 కోట్ల ఆస్తినష్టాన్ని మిగిల్చాయి.. ఆనాటి ఆ రాత్రి సముద్రం సృష్టించిన విలయం ఇప్పటికీ దివి గుండెల్లో ఓ పెను ప్రళయమే. అంతటి విపత్తు జరిగి 48 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ఇక్కడి తీరప్రాంతాలు ఎంతవరకు భద్రంగా ఉన్నాయని ప్రశ్నిస్తే సమాధానం రావడం కష్టమే అవుతుంది. కంటినిండా నిద్రపోతున్నారా.. అంటే.. కాదనే జవాబు దివివాసుల కన్నీళ్లలో కనిపిస్తుంది. అక్రమార్జనకు అలవాటుపడిన అవినీతిపరులు తీరాన్ని తవ్వేస్తుంటే, 'కట్టలు' తెంచుకుంటున్న సముద్రుడు నానాటికీ ముందుకు చొచ్చుకొస్తుంటే, బంగారు భూముల్లో ఒక్క పంట పండటం గగనమైపోతుండగా.. గతాన్ని తలచుకుంటూ, భవిష్యత్తుపై భయాందోళనతో బతుకుతున్న దివివాసులు ఆకాశంలో ఏ చిన్న మెరుపు మెరిసినా, దూరంగా ఏ పిడుగుపడినా, అల్పపీడనాలపై ఏ చిన్న హెచ్చరిక వచ్చినా కంగారు పడిపోతున్నారు.



ఎదురుమొండి దీవుల్లో కోతకు గురవుతున్న కరకట్ట

6లో



ఆపరేషన్ బుడమేరు ఏమైంది?

అయోధ్యనగర్‌లోని రాఘవేంద్ర థియేటర్ సమీపంలో బుడమేరు కట్ట ఆక్రమించుకుని ఏర్పాటుచేసిన దుకాణాలు

నగరంలో పెరుగుతున్న ఆక్రమణలు

- వరదలు ముంచెత్తినా మారని అక్రమార్కులు
- అయోధ్యనగర్ కట్ట వెంబడి భారీగా..
- పాతరాజరాజేశ్వరిపేటలోనూ అదే పరిస్థితి
- నెలలో 'ఆపరేషన్ బుడమేరు' చేపడతామన్న మంత్రి
- ఆక్రమణల తొలగింపు సరే.. అడ్డుకునే వారేరీ..?

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : బుడమేరు పరివాహక ప్రాంతం 2,930 ఎకరాలు కాగా, ఒక్క నగర పరిధిలోనే బుడమేరు భూములు సుమారు 80 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు అధికారులు నివేదిక తయారు చేశారు. ఎకరం భూమి విలువ రూ.10 కోట్ల పైచిలుకు ఉంటుందని తేల్చారు. అంటే.. మొత్తం ఆక్రమణల విలువ రూ.800 కోట్లపైనే అని నివేదికలో పేర్కొన్నారు. ఇక నగరం కాకుండా ఇతర ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాలు బుడమేరు పరివాహక ప్రాంతం ఆక్రమణలకు గురైనట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. వీటిని తొలగించి, భవిష్యత్తులో నగరానికి వరద ముప్పు తొలగించేందుకు ఆపరేషన్ బుడమేరు చేపట్టనున్నట్లు సెప్టెంబరు నెలాఖరులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ప్రకటించారు. సుమారు 2 నెలలు గడిచినా ఇంతవరకు ఒక్క ఆక్రమణను తొలగించింది లేదు. పైగా రోజురోజుకూ ఆక్రమణలు పెరుగుతూనే ఉన్నాయి. సాధారణంగా బుడమేరు వాగు వెడల్పు 50 నుంచి 120 మీటర్లు ఉండాల్సి ఉండగా, చాలాచోట్ల 10 నుంచి 30 మీటర్లకు కుంచించుకుపోయింది. రియల్ వ్యాపారులు బుడమేరును పూడ్చేసి ఏకంగా కాంక్రీట్ స్లాబులతో బిల్డింగ్‌లు కట్టేశారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలో ఈ ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పాటు సెంట్రల్, గన్నవరం నియోజకవర్గాల్లోనూ బుడమేరు ఆక్రమణలు పెద్దస్థాయిలో ఉన్నాయి.

ఆపరేషన్ బుడమేరు ఎప్పుడు?

ఆపరేషన్ బుడమేరులో భాగంగా బుడమేరు మొదలైన దగ్గర నుంచి కొల్లేరులో కలిసే వరకు ఆక్రమణలు తొలగించి అవసరమైన మేరకు అంటే.. కనీసం 50 మీటర్ల వెడల్పు చేయాలన్నది అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతోపాటు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రస్తుతం ఉన్న డిశ్చార్జి సామర్థ్యాన్ని 7 వేల క్యూసెక్కుల నుంచి 25 వేల క్యూసెక్కులకు పెంచాలని భావిస్తున్నారు. ఇది పెరగాలంటే ఆక్రమణలు తొలగించి, బుడమేరు కాల్వను వెడల్పు చేయక తప్పదు. ఆక్రమణల తొలగింపుతో పాటు విజయవాడ నగర పరిధిలో బుడమేరు ప్రవాహ మార్గంలో రెండువైపులా పటిష్టమైన కరకట్టలు నిర్మించి నగరానికి ముంపు నుంచి రక్షణ కల్పించడంతో పాటు ముందు ఆక్రమణలకు ఆస్కారం లేకుండా చేయాలన్నది 'ఆపరేషన్ బుడమేరు' లక్ష్యం. ఇవన్నీ ఎప్పుడు కార్యరూపం దాలుస్తాయని నగరవాసులు ఎదురుచూస్తున్నారు. అలాగే, తాజాగా జరుగుతున్న ఆక్రమణలను నిలువరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాల సేకరణ ధర పెంపు

లీటరు గేదె పాలపై రూ.2, ఆవు పాలపై రూ.1.50

- పాడి రైతులకు 2వ విడత బోనస్‌గా రూ.12 కోట్లు విడుదల
- కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సమావేశంలో నిర్ణయం
- వివరాలు వెల్లడించిన చైర్మన్ చలసాని ఆంజనేయులు



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) పాడి రైతులపై వరాల జల్లు కురిపించింది. 10 శాతం వెన్న కలిగిన గేదె పాల సేకరణ ధర లీటరుకు రూ.2, ఆవు పాలకు రూ.1.50 పెంచింది. రెండో విడత రూ.12 కోట్ల బోనస్‌ను ప్రకటించింది. ప్రస్తుతం 10శాతం వెన్న కలిగిన పాలకు రూ.80 చెల్లిస్తుండగా, దానికి రెండు రూపాయలు పెంచారు. ఈ మేరకు సోమవారం పాలఫ్యాక్టరీలో జరిగిన పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ వివరాలను యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు వెల్లడించారు. కృష్ణా మిల్క్ యూనియన్‌లో ఉన్న పాలరైతులకు నాలుగు నెలలకు సంబంధించిన రెండో విడత బోనస్ రూ.12 కోట్లను మంగళవారం విడుదల చేస్తున్నామని తెలిపారు. ఏడాదికి మూడు విడతలుగా బోనస్ ఇస్తున్నామన్నారు. యూనియన్ మ్యాక్స్ చట్టంలో ఉన్న నేపథ్యంలో ఆర్థిక లాభం లెక్కలు వేసుకుని బోనస్‌లు ప్రకటిస్తున్నామన్నారు. రైతు నుంచి తీసుకునే పాలకు లీటరుకు రూ.82 ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఆవు పాలకు రూ.1.55 పెంచామన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ధరలు పెంచుతున్నామన్నారు. ఎలాంటి సంక్షోభాలు వచ్చిన రైతులకు సాయం చేయడానికి కృష్ణామిల్క్ యూనియన్ ముందుంటుందన్నారు. గ్రామీణ యువతకు డెయిరీ ఫాంపై ఆసక్తిని పెంచేందుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారుడి నుంచి తీసుకున్న డబ్బుల్లో 82శాతం పాడి రైతులకు ఇస్తున్నా మన్నారు. వరదల సమయంలో పాలఉత్పత్తి ఆగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. పాలక మండలి సమష్టి కృషితో ఈ ఫలితాలు చూస్తున్నామన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

కొంతమంది కావాలనే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ దేశంలో ఆదర్శవంతమైన డెయిరీ అని చెప్పారు. తమతో పోటీ పడలేక అమూల్ వంటి సంస్థలు వెనుకబడిపోయాయన్నారు. సంపాదనలో మూడు సార్లు రేటు, బోనస్ ఇచ్చేది కృష్ణా మిల్క్ యూనియన్ మాత్రమేనన్నారు. ఇప్పటికే రైతులకు బోనస్‌తో కలిపి లీటరుకు సుమారు రూ.91లు ఇస్తున్నామన్నారు. ఈ ధరను మరింతగా పెంచుతామన్నారు. ఈ సమావేశంలో యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, వేమూరి సాయి వెంకట రమణ, చలసాని చక్రపాణి, ఆర్జి వెంకట నగేష్, పలగాని కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో గందరగోళం



ఆరబెట్టిన ధాన్యం

రైతులను భయపెడుతున్న వాతావరణంలోని మార్పులు

- ఆన్‌లైన్‌లో నమోదు కాకుండానే మిల్లులకు ధాన్యం తరలింపు
- మండపేట, తదితర వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయం

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ తీవ్ర గందరగోళంగా మారింది. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులు రైతులకు కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయి. దీంతో ధాన్యం వర్షానికి ఎక్కడ తడుస్తుందో అని భయపడి పలువురు నిబంధనలకు విరుద్ధంగా మిల్లులకు తరలించేస్తున్నారు. ఇంకొందరు తక్కువధరకే వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల నుంచి రైతులు విక్రయించిన ధాన్యం రవాణా చేసినట్లుగా వివరాలు జీపీఎస్‌లో నమోదు కావాలనే షరతు ఉంది. రైతు సేవా కేంద్రాలలో ధాన్యం, రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ట్రక్‌షీట్ తయారు చేసిన తరువాత రైతులు విక్రయించిన ధాన్యం ఏ మిల్లుకు చేరిందనే అంశంపై జీపీఎస్ విధానంలో నిఘా ఉంచుతారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలంటే ప్రభుత్వానికి బ్యాంకు గ్యారంటీని చూపాలి. కానీ గత మూడు, నాలుగు రోజులుగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు, మరో నాలుగైదు రోజుల్లో వర్షం కురుస్తుందనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఒత్తిడి గురై మిల్లులకు ధాన్యం అనుమతులు లేకుండానే తరలించారు. ఈ నెల 23వ తేదీ నుంచి కోస్తాతీరం వెంబడి వర్షాలు కురుస్తాయనే హెచ్చరికల నేపథ్యంలో రైతులు ధాన్యం మిల్లులకు మరింతగా తరలించేపనిలో ఉన్నారు. ఈ ధాన్యానికి బిల్లులు ప్రభుత్వం నుంచి మంజూరవుతాయా లేదా, అనే అంశంపై సందిగ్ధత నెలకొంది.

బస్తా ధాన్యం ధర నాడు రూ.1,900.. నేడు రూ.1,450

బీపీటీ-5204, బీపీటీ క్రాసింగ్ అయిన 1262, 1224 వంటి సన్నరకాల ధాన్యం గతేడాది మండపేట, తిరుపతి తదితర ప్రాంతాలకు చెందిన ప్రైవేటు వ్యాపారులు 75 కిలోల బస్తా ధాన్యం రూ.1,850 నుంచి రూ.1,900లకు కొనుగోలు చేశారు. గతేడాది పంట చేతికొచ్చే సమయంలో భారీవర్షాలు కురిసి ధాన్యంలో నాణ్యత దెబ్బతింది. బియ్యం దిగుబడి కూడా తగ్గింది. ఈ కారణంతో ఈ ఏడాది మండపేట తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ముందుచూపుతో వ్యవహరించి బస్తా ధాన్యం కేవలం రూ.1,400 నుంచి రూ.1,450లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మండపేట వ్యాపారులు ఇచ్చేధరకు మరో రూ.50 కలిపి స్థానిక మిల్లర్లు సన్నరకాలు, 1061 వంటి ముతకరకాల ధాన్యం బస్తాకు రూ.1,500 చొప్పున ధరగా నిర్ణయించి రెండు రోజుల కిందటి వరకు కొనుగోలు చేశారు. వాతావరణం మారడంతో ముతకరకాలు, సన్నరకాల ధాన్యం తేడాలేకుండా స్థానిక మిల్లర్లు బస్తాకు రూ.1,450 మించి ఇవ్వలేమని ధరలో కోతపెట్టారు. ఇష్టమైతేనే ధాన్యం విక్రయించాలని అనడంతో రైతులు తాము పండించిన ధాన్యం ఎవరికి విక్రయించాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నారు. రైతులు తాము పండించిన ధాన్యం ఏ మిల్లుకైనా విక్రయించుకునే వెసులుబాటును కూటమి ప్రభుత్వం ఇచ్చింది. అయితే జిల్లా యూనిట్‌గా లేక మండలం యూనిట్‌గా ధాన్యం కొనుగోలు చేసే అంశంపై అధికారులు నేటికీ స్పష్టత ఇవ్వలేదు. 30 కిలో మీటర్లు దూరం దాటిన మిల్లులకు ధాన్యం విక్రయిస్తే రవాణా చార్జీలు మిల్లర్లే పెట్టుకోవాల్సి ఉంది. ఈ సందిగ్ధ స్థితిలో మండపేటకు చెందిన వ్యాపారులు ఇప్పటికే జిల్లా నుంచి 600 లారీలకుపైగా ధాన్యం తరలించుకుపోయారు.



తగ్గిన దిగుబడి

గతేడాది బీపీటీ-5204, బీపీటీ క్రాసింగ్ 1262, 1224 వంటి వరి రకాలు ఎకరానికి 35 బస్తాల వరకు రైతులు అవలంభించిన యాజమాన్య పద్ధతులను బట్టి దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది పైరు పిలకలు తొడిగేదశలో భారీ వర్షాలు, వరదలు ముంచెత్తడంతో వరిపైరు రోజుల తరబడి నీటమునిగి ఉండటంతో పిలకలు చనిపోయాయని, దీంతో ఈ ఏడాది ఎకరానికి సన్నరకాలు 28 బస్తాలలోపే దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. ముతక రకాలు సైతం దిగుబడి తగ్గుతోందని రైతులు అంటున్నారు. ఏటా జిల్లాలో 13 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా కాగా, ఈ ఏడాది వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయశాఖ అధికారులు దిగుబడి 9.50 లక్షల టన్నులు వస్తుందని అంచనాకు వచ్చారు.

మిల్లర్ల వద్ద కోట్లాది రూపాయల విలువైన ధాన్యం

వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం కురుస్తుందనే హెచ్చరికలతో ధాన్యం తడిసిపోతుందనే భయంతో రైతులు యంత్రాల ద్వారా వరికోతలు పూర్తి చేస్తున్నారు. తేమశాతం అధికంగా ఉన్నా ధాన్యంను రైతులు విక్రయించేస్తున్నారు. మిల్లులకు చేరిన ధాన్యం వివరాలను మిల్లుల వద్ద ఉన్న అధికారులు ధాన్యం దిగుమతి చేసుకున్నట్లుగా రికార్డులలో నమోదు చేయాలి. మిల్లర్లు ఈ ధాన్యం ఆన్‌లైన్‌లో విక్రయించినట్లుగా చూపి రైతులకు ధాన్యం బిల్లులు చెల్లించాలి. ఇప్పటికే పెడన, బంటుమిల్లి, జింజేరు, గూడూరు, ఘంటసాల, కంకిపాడు, ఉయ్యూరు తదితర ప్రాంతాల నుంచి ధాన్యం జిల్లాలోని పలు మిల్లులకు తరలించారు. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తరువాతనే ధాన్యం బిల్లులు చెల్లించడానికి అవకాశం ఉంటుంది. జీపీఎస్‌లో నమోదు కానందున ఆన్‌లైన్ చేసేందుకు అంగీకరించకుంటే, ధాన్యం నగదును మిల్లర్లే రైతులకు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మిల్లు యజమానులపై పెనుభారం పడి ధాన్యం బిల్లులను ఇవ్వడం అసాధ్యమవుతుంది. వాతావరణ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ధాన్యం కొనుగోలులో నెలకొన్న పరిస్థితులపై జిల్లా అధికార యంత్రాంగం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. నిబంధనల ప్రకారమే జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు సృజన తెలిపారు.

బెల్టు తీస్తున్నారు



- గ్రామాల్లో విస్తరిస్తున్న బెల్టు షాపులు
- సిండికేట్ల కనుసన్నల్లో భారీ విక్రయాలు
- బడ్డీల్లో బాటిళ్లు ఉంచి అధిక ధరలకు..
- సీసాలపై హీల్స్ తొలగించి అమ్మకాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మద్యం నూతన పాలసీ అమల్లోకి వచ్చి కొత్త షాపులు తెరుచుకున్న కొద్దిరోజులకే 'బెల్టు' బాగోతాలు బయటపడుతున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని కొంతమంది ఈ బెల్టు వ్యవహారాలను సాగిస్తున్నారు. మద్యం షాపులను దక్కించుకోవడానికి వ్యాపారులంతా సిండికేట్లుగా మారినట్టుగానే బెల్టు షాపుల నిర్వహణకు కొత్తగా సిండికేట్లు తయారయ్యారు. వీరి కనుసన్నల్లో జిల్లాలో కొత్తకొత్త చిత్రాలు కనిపిస్తున్నాయి.

హీల్స్ మాయం

గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులు నిర్వహించేవారు వివిధ షాపుల నుంచి వివిధ రకాల బ్రాండ్లకు చెందిన మద్యాన్ని కొంటున్నారు. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం ఒక కొనుగోలుదారుడికి మూడు మద్యం సీసాలకు మించి విక్రయించకూడదు. అంతకుమించి ఉంటే ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేస్తారు. కొన్ని మద్యం షాపుల యజమానులు ఈ నిబంధనను గాలికి వదిలేశారు. ఒక కొనుగోలుదారుడు ఎన్ని మద్యం సీసాలు అడిగితే అన్నీ ఇచ్చేస్తున్నారు. పైగా ధరలను పెంచి విక్రయిస్తున్నారు. బడ్డీకొట్ల ముసుగులో ఈ బెల్టు వ్యవహారాలు సాగిస్తున్నట్టు సమాచారం. కొంతమందైతే ఇళ్లలోనే రహస్యంగా తంతు నడిపిస్తున్నారు. మద్యం దుకాణాల నుంచి సరుకును కొంటున్న వెంటనే ఆ సీసాలపై మూత చుట్టూ ఉండే హీల్ (హోలో గ్రామ్)ను తీసేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు చిక్కినప్పుడు గుట్టు బయటకు రాకుండా ఉండేందుకు ఈవిధంగా చేస్తున్నారు. ఈ హీల్‌పై బార్ కోడ్ ఉంటుంది. దీన్ని స్కాన్ చేయగానే ఆ సీసాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయి. ఏ డిస్టలరీలో తయారైంది, దాని బ్యాచ్ నెంబరు ఎంత, అక్కడి నుంచి ఏ మద్యం దుకాణానికి ఈ సీసా వెళ్లింది.. అనే విషయాలు బయటపడతాయి. ఈ కారణంగా హీల్స్‌ను తొలగిస్తున్నారు. బెల్టుషాపులు నిర్వహించే వారికి మద్యం షాపుల యజమానులే ఈ సలహాలు ఇస్తున్నారు.

ఈ రెండు నెలల్లో ఉమ్మడి జిల్లాలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ లెక్క	
కేసులు	332
అరెస్టయిన నిందితులు	328
బైండోవర్ అయిన నిందితులు	155
సీజ్ చేసినవి (నాటుసారా)	196 లీటర్ల
బెల్లపు ఊట	9,850 లీటర్లు
ఎన్‌డీపీఎల్	526 సీసాలు
డీపీఎల్	784 సీసాలు

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాల సవరణపై దృష్టి సారించండి

అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం



అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం

6లో

అక్రమ కట్టడాలు తొలగించాలి

- టీడీపీ, జనసేన నేతల ధర్నా

8లో



సోషల్ మీడియా సైకోలపై చర్యలు తీసుకోండి

- అవనిగడ్డలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

6లో


కోడూరు మండలంలో అవుట్ ఫాల్ స్లూయిస్ దుస్థితి


శిథిలావస్థకు చేరిన సముద్రపు కరకట్ట

తీరాన తీరని అలజడి

రెండు దిక్కుల్లో సముద్రం. మిగిలిన రెండు దిక్కుల్లో కృష్ణానది, నడుమ ఉండే దీవే దివిసీమ. ప్రకృతి వైపరీత్యాలు, ఉప్పెన ముప్పులు, వరదలతో తరచూ ఈ ప్రాంతం తల్లడిల్లిపోతోంది. దివిసీమ ఉప్పెన అనంతరం సముద్రపు అలలు చెలియల కట్టు దాటి గ్రామాలపై పడకుండా రక్షణగా కరకట్టను పటిష్ఠపర్చి నది ద్వారా లోపలికి వచ్చే నీరు బయటకు పోయేలా, పోటు సమయాల్లో సముద్రపు నీరు లోపలికి రాకుండా అవుట్‌ఫాల్ స్లూయిస్‌లను ప్రభుత్వం నిర్మించింది. వరద నీరు గ్రామాల్లోకి రాకుండా కృష్ణా కరకట్టను పటిష్ఠపరిచింది. 1999లో చంద్రబాబు ప్రభుత్వం కృష్ణా కరకట్టలు పునర్నిర్మించింది. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం సముద్రపు కరకట్టను పునర్నిర్మించింది. కృష్ణా కరకట్టలు కొంతమేర పటిష్ఠంగా ఉన్నప్పటికీ సముద్రపు కరకట్టలు తీర ప్రాంత ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. సముద్రపు కరకట్టల నిర్వహణను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వైసీపీ ప్రభుత్వం రూ.25 కోట్లతో కరకట్టలను పటిష్ఠపరుస్తామని ఉత్తుత్తి ప్రకటన చేసింది. రెండేళ్లకు కూడా డీపీఆర్‌లు తయారు చేయలేదు. కరకట్టలు పటిష్ఠపర్చాలంటూ అప్పుడు మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో నాటి ప్రతిపక్ష టీడీపీ కరకట్ట పొడవునా పాదయాత్ర చేసింది. ప్రతిపక్షంలో ఉన్న వారు అధికారంలోకి వచ్చారు. కానీ ఇంతవరకు కరకట్టల ఊసే తీయలేదు. అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల ద్వారా సముద్రపు నీరు పొలాలను ముంచెత్తుతోంది.

- ఇప్పటికీ తీరంలో భద్రత ప్రశ్నార్థకమే..
- వైపరీత్యాల నుంచి పాఠాలు నేర్వని పాలకులు
- విపత్తుల నిర్వహణపై కొరవడిన శ్రద్ధ
- యథేచ్ఛగా సాగుతున్న పర్యావరణ విధ్వంసం
- వైసీపీ హయాంలో బ్లాక్ శాండ్ పేరిట దోపిడీ
- కరకట్ట సమీపంలో భారీ తవ్వకాలు
- పొలాల్లోకి చొచ్చుకొస్తున్న సముద్రపు నీరు
- కోతకు గురవుతున్న కృష్ణానది తీరప్రాంతాలు
- తీరంలో క్షణక్షణం.. భయంభయం

దివిసీమ ఉప్పెనకు నేటికి 48 ఏళ్లు

(ఆంధ్రజ్యోతి-అవనిగడ్డ): దివి ప్రాంతంలో విచ్చలవిడిగా పర్యావరణ విధ్వంసం సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో బ్లాక్‌శాండ్ పేరుతో సముద్ర చెలియలి కట్ట సమీపంలో తవ్వకాలు చేపట్టి తీర భద్రతకు సవాల్ విసిరారు. సముద్రపు బ్యాక్ వాటర్ పాయల్లో తవ్వకాలు జరపకూడదని పెట్టిన సీఆర్‌జడ్ నిబంధనలను వైసీపీ హయాంలో తుంగలో తొక్కారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ సీఆర్‌జడ్ నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘనకు గురవుతున్నాయి.

చొచ్చుకొస్తున్న సముద్రం

వీటి కారణంగా తీరగ్రామాల్లో కృష్ణానదీ పరివాహక గ్రామాల్లో కోత తీవ్రత ఆందోళనకర స్థాయికి పెరిగిపోయింది. రెండు, మూడు దశాబ్దాలుగా విచ్చలవిడిగా సాగుతున్న పర్యావరణ విధ్వంసం కారణంగా వాతావరణంలో పెనుమార్పులు సంభవించి, భూతాపం నానాటికీ పెరిగిపోతోంది. అది సముద్రపు తీర గ్రామాల్లో భౌగోళిక పరిస్థితుల్లో మార్పునకు కారణమవుతోంది. కృష్ణానది సముద్రంలో కలిసే ప్రాంతాల్లో సముద్రపు మట్టం గణనీయంగా పెరిగి సముద్రం క్రమేణా ముందుకు వస్తోంది. కోడూరు, నాగాయలంక మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల్లోని ఐదు వేల ఎకరాల్లో నాలుగున్నరేళ్లుగా ఒక్క పంట కూడా తీసుకోలేకపోయారు. ఈ ఏడాదీ సముద్రపు నీరు డ్రెయిన్ల ద్వారా పంట పొలాలను ముంచెత్తుతోంది.

అది కాళరాత్రి..

1977 నవంబరు 19వ తేదీన రాత్రి సంభవించిన దివిసీమ పెను ఉప్పెనకు నేటితో 47 ఏళ్లు పూర్తయ్యాయి. తాడెత్తున ఎగసిన రాకాసి అలలు గ్రామాలపై విరుచుకుపడి కృష్ణాజిల్లా నాగాయలంక, కోడూరు మండలాలతోపాటు ప్రస్తుతం బాపట్ల జిల్లా రేపల్లె ప్రాంతంలోని తీరప్రాంత గ్రామాల్లో దాదాపు 10 వేల మందికిపైగా మృతిచెందారు. లక్షలాది పశువులు మృత్యువాత పడ్డాయి. ఆనాటి ప్రభుత్వ అంచనాల మేరకు దాదాపు రూ.175 కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. ఆ ఒక్కరాత్రి జరిగిన నష్టాన్ని పూడ్చి మళ్లీ ఈ ప్రాంతాన్ని పునర్నిర్మించటానికి పదేళ్ల కంటే ఎక్కువ సమయమే పట్టింది. దివిసీమ ప్రజలు ఆ రాత్రిని కాళరాత్రిగా చెబుతారు. తాడెత్తున ఎగసిన సముద్రపు అలలు నాగాయలంక మండలంలోని సొర్లగొంది, నాలి, దీనదయాళపురం, సంగమేశ్వరం, గుల్లలమోద, కోడూరు మండలం పాత ఉపకాలి, హంసలదీవి, ఇరాలి, రామకృష్ణాపురం గ్రామాలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. నిద్రలో ఉన్నవారు నిద్రలోనే జల సమాధి అయ్యారు. కొందరు చెట్లు పట్టుకుని వేలాడుతూ ప్రాణాలు దక్కించుకున్నారు. తీరం నుంచి దాదాపు 8 కిలోమీటర్ల దూరం అలలు పోటెత్తి గ్రామాలను ముంచేశాయి. సొర్లగొంది, నాలి, సంగమేశ్వరం, పాలకాయితిప్ప, హంసలదీవి, రామకృష్ణాపురం, ఊటగుండం, ఇరాలిలో ప్రతి గ్రామంలోనూ వందల్లో ప్రాణాలు కోల్పోయారు. ఎటుచూసినా శవాల గుట్టలు.. అయిన వారిని కోల్పోయిన వారి ఆర్తనాదాలు..తినేందుకు తిండి, తాగేందుకు గుక్కెడు నీరు దొరకలేదని విపత్తు నుంచి బయటపడిన వారు చెబుతుంటారు. నాడు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవటంతో మూడో రోజుకు గానీ ప్రపంచానికి తెలియలేదు. ఆపన్నులకు అండగా ఉన్నామంటూ దేశ, విదేశాల నుంచి స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల విద్యార్థులు, కళారంగం నుంచి కళాకారులు తరలివచ్చారు. కుళ్లి కంపుకొడుతున్న శవాలకు దహన సంస్కారాలు నిర్వహించేందుకు శవసేన ఏర్పాటైంది. నాటి మంత్రి మండలి వెంకట కృష్ణారావు నేతృత్వంలో సహాయక పునరావాస కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రాధినేతలు, దేశాధినేతలు తరలివచ్చి పునర్నిర్మాణానికి చేయూతనందించారు. పుష్కరకాలానికి గానీ మరుభూమిగా మారిన దివిగడ్డ పునర్నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పటికీ ఆకాశంలో చిన్న మెరుపు మెరిసినా, దూరంగా పిడుగు పడినా, సముద్రపు అల్పపీడనాలపై ఏ చిన్న హెచ్చరిక వచ్చినా దివి ప్రజల్లో తెలియని భయం, ఆందోళన.

ప్రజలు కోరుకుంటున్నది ఇదీ..

- శిథిల తుఫాను షెల్టర్ల స్థానంలో తుఫాన్లు, సునామీలు తట్టుకునేలా ప్రజలతోపాటు పశువులు రక్షణ పొందేలా బహుళ ప్రయోజన షెల్టర్లు నిర్మించాలి. ఇప్పటికే ఈలచెట్లదిబ్బలో ఇలాంటి షెల్టర్ నిర్మించారు.
- విపత్తులు సంభవించినప్పుడు తీర గ్రామాలకు అధికారులు, సహాయ బృందాలు వచ్చేందుకు రహదారులు నిర్మించాలి.
- తీర గ్రామాల్లో సముద్రపు కోత నివారణకు నిపుణులతో అధ్యయనం చేయించి శాశ్వత పరిష్కారం చూపాలి.
- బలహీన సముద్రపు కరకట్టలు పటిష్ఠపరిచి సముద్రపు నీరు డ్రెయిన్ల ద్వారా గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.
- తీర గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీలను అనుసంధానించి వనరుల కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రజలకు విపత్తులను ఎదుర్కొనేలా శిక్షణ ఇవ్వాలి. వనరుల కేంద్రాల్లో జనరేటర్లు అందుబాటులో ఉంచాలి. 2004 సునామీ అనంతరం కొన్ని గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో వనరుల కేంద్రాలు ఏర్పాటు చేశారు. పంచాయతీల అజమాయిషీ లేక అవి మూలనపడ్డాయి. రెవెన్యూ కార్యాలయాల వద్ద నిలిపి ఉంచిన పడవలు శిథిలమై ప్రభుత్వానికి లక్షల్లో నష్టం వాటిల్లింది.
- విశాఖపట్నంలో మాదిరిగా గాలులలను తట్టుకునేలా గుండ్రని విద్యుత్ స్తంభాలు, భూగర్భ విద్యుత్ లైన్స్ వేయాలి.

పునర్నిర్మాణానికి పన్నెండేళ్లు పట్టింది



ఉప్పెన అనంతరం దివి ప్రాంత పునర్నిర్మాణానికి దాదాపు పన్నెండేళ్లు పట్టింది. నాడు మంత్రిగా ఉన్న మండలి వెంకట కృష్ణారావు పదవిని త్యాగం చేసి పునరావాస కార్యక్రమాలు నిర్వహించారు. అవనిగడ్డ గాంధీక్షేత్రంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి ఎందరినో ఆదుకున్నారు. ఆనాడు ఆయన వేసిన కరకట్టే ఇప్పుడున్న సముద్రపు కట్ట. తర్వాత మండలి బుద్ధప్రసాద్ ఎమ్మెల్యేగా ఆ కరకట్టను పునర్నిర్మించారు. ఆనాడు విద్యార్థిగా ఉండి నాలాంటి ఎందరో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

- భోగాది రమణ

మెరుగైన సాంకేతికతను వినియోగించుకోవాలి



విపత్తులు ఎదుర్కొనే సన్నద్ధంగా ఉండాలి. మెరుగైన సాంకేతికతను వినియోగించుకోవాలి. జపాన్, ఇండోనేషియా వంటి చోట్ల విపత్తులను ఎదుర్కొనే వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా ఉంది. అలాంటి సన్నద్ధత మనకూ అవసరం. సముద్రపు కోత, నదీ తీర గ్రామాల్లో పెరుగు తున్న నదీపాతం గురించి నిపుణుల ద్వారా అధ్యయనం జరగాల్సి ఉంది.

- బొబ్బా గోవర్ధన్, ఎన్ఆర్ఐ, పాత ఎడ్లంక

విపత్తులు ఎదుర్కొనే సన్నద్ధత ఏదీ..

1977 ఉప్పెన అనంతరం పలు తుపాన్లు, వరదలు దివి ప్రాంతాన్ని అతలాకుతలం చేసినప్పటికీ సహాయ పునరావాసాలపైనే ప్రభుత్వం దృష్టి పెడుతోంది. నష్ట తీవ్రత తగ్గించేలా చర్యలు చేపట్టడంలో విఫలమవుతూనే ఉంది. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో విపత్తుల నష్ట తగ్గింపు కార్యక్రమం కింద తీర గ్రామాల్లో తుఫాన్ షెల్టర్లకు వెళ్లేలా తారు రోడ్లు వేశారు. కానీ షెల్టర్ల గురించి గానీ, మండల కేంద్రాల్లో నుంచి తీర గ్రామాలకు వెళ్లే రహదారుల గురించి గానీ, అత్యవసర సమయాల్లో వారికి వారే సహాయం చేసుకునేలా తీర గ్రామాల ప్రజలకు శిక్షణ ఇవ్వటంలో గానీ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి.

అసెంబ్లీ వాయిస్

జగన్..పేదలను నానా అవస్థలు పెట్టాడు

- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



జి.కొండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షపాతి అని ప్రచారం చేసుకున్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తన పాలనలో పేదలను నానా అవస్థలు పెట్టాడని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ విమర్శించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో పక్కా గృహాల అంశంపై ఆయన మాట్లాడారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన పక్కా గృహాల బిల్లులను జగన్ 2019-24 వరకు ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెట్టిందన్నారు. చంద్రబాబు చేపట్టిన ప్రతి పనికి వ్యతిరేకంగా జగన్ ప్రవర్తించాడన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.920 కోట్లు, మైలవరంలో రూ.6 కోట్లు పైగా పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించి పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నారు. సమగ్ర సర్వే చేయించి బిల్లులు ఇప్పించాలని గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథిని వసంత కోరారు.

మల్లవల్లి పారిశ్రామికవాడలో సదుపాయాలు కల్పించాలి

- గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం: మల్లవల్లి పారిశ్రామికవాడలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోమవారం అసెంబ్లీలో కోరారు. 479 ఎకరాల అసైన్డ్ భూమిని భూసేకరణ చేయాలని కోరారు. మరో 183 మంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. అక్కడ ఫైర్‌స్టేషన్, పోలీస్ ఔట్‌పోస్ట్, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ నిర్మించాలన్నారు. ఎకరం రూ.16.50 లక్షలకే పారి శ్రామికవేత్తలకు ఇవ్వటం కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనమ న్నారు. గత వైసీపీ ప్రభుత్వం మల్లవల్లిలో భూములను ఎకరం రూ.89 లక్షలకు పెంచడం వల్ల అతీగతిలేకుండా పోయిందని విమర్శించారు. అశోక్ లేల్యాండ్ రీ ఓపెనింగ్‌కు సిద్ధంగా ఉందని యార్లగడ్డ తెలిపారు.

ముక్త్యాల ఎత్తిపోతల పథకం ప్రారంభించాలి

- జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



జగ్గయ్యపేట: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేరు మార్చి, నిధులు ఇవ్వకుండా ఏమార్చిన ముక్త్యాల ఎత్తిపోతల పథకానికి మళ్లీ అంచనాలు వేసి ప్రారంభించాలని అసెంబ్లీ సమావేశాల్లో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోరారు. టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని వేదాద్రిగా పేరు మార్చి, స్థలం మార్చి, కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇవ్వకపోవటంతో నిలిచిపోయిందని, తిరిగి అంచనాలు వేసి పాత పథకం పనులు ప్రారంభించాలని ఆయన కోరారు. డిజైన్ లోపంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు ప్రారంభించిన పోలంపల్లి ఆనకట్ట ఇప్పటికీ పూర్తిస్థాయిలో నీరందించలేకపోతుందని, రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నీటి పారుదల శాఖ మంత్రి స్వయంగా వచ్చి ఆ రెండు ప్రాజెక్టులను పరిశీలించాలని, తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తాతయ్య కోరారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాల సవరణపై దృష్టి సారించండి

- అధికారులకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం


ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో స్వాతి తదితరులు

మచిలీపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాల సవరణ, ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో సోమవారం జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవో కె.స్వాతి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి, జిల్లాలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి 119, ఉద్యోగుల నుంచి 21అర్జీలు వచ్చాయని, గడువుదాటిన మూడు అర్జీలు విద్యాశాఖ, వ్యవసాయశాఖలో ఉన్నాయని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల ప్రతిపాదనలను త్వరితగతిన తనకు పంపాలన్నారు. రాష్ట్రబడ్జెట్‌ను పరిశీలించి, వివిధ శాఖలకు కేటాయించిన నిధులను జిల్లాలో ఏ పనులు చేయొచ్చో అధికారులు వారంలోగా అంచనాలు తయారుచేయాలని ఆదేశించారు ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికకు ఫాం-18 దరఖాస్తుల పరిశీలన అధిక సంఖ్యలో పెండింగ్ ఉన్నాయని, సిబ్బంది మొత్తాన్ని వినియోగించి సోమవారం రాత్రికే ఈ పనిని పూర్తిచేయాలని ఆదేశించారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో 8వ డివిజన్‌కు చెందిన దివ్యాంగుడు పల్లె ప్రవీణ్ కుమార్ తనకు మూడుచక్రాల కుర్చీ కావాలని అర్జీ అందజేయగా, అప్పటికప్పుడు చక్రాల కుర్చీని అందజేశారు. ఈనెల 15న కృష్ణాయూనివర్సిటీలో ఉపాధ్యాయులకు నిర్వహించిన ఆంగ్లబాష బోధనా శిక్షణ కార్యక్రమంలో మూడు గంటలపాటు ప్రసంగించిన కలెక్టర్ బాలాజీని డీఈవో రామారావు, అధికారులు ఘనంగా సత్కరించారు.

వంద ఎకరాలు ఏపీఐఐసీకి ఇవ్వొద్దు

- కలెక్టర్ బాలాజీకి మల్లవల్లి నాయకుల వినతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మల్లవల్లిలో ఏపీఐఐసీకి కేటాయించిన భూమిలో పేదల ఇళ్ల స్థలాల కోసం, స్కూల్ నిర్మాణం కోసం విడగొట్టిన 100 ఎకరాల భూమిని అలాగే ఉంచాలని ఏపీఐఐసీకి ఇవ్వొద్దని గ్రామస్థుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ నాయకులు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. మల్లవల్లిలోని సర్వేనెం 11లోని 1460 ఎకరాల భూమిలో గ్రామానికి దగ్గరగా ఉన్న 100 ఎకరాలను విడదీసి రెవెన్యూశాఖకు అప్పగించారని, గ్రామంలోని పేదలకు నివాస స్థలాలు కేటాయించేందుకు, హైస్కూల్ నిర్మాణానికి వినియోగించుకునేందుకు కేటాయించారని వివరించారు. కానీ ఏపీఐఐసీ వారు గ్రామానికి కేటాయించిన భూమిలోనూ పనులు మొదలు పెట్టారని తెలిపారు. అస్థలంలో రూ.2 కోట్లతో హైస్కూల్ నిర్మాణం జరుగుతోందని వివరించారు. గుడివాడ ఆర్డీవో, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌తో ఫోన్‌లో కలెక్టర్ మాట్లాడారని, మంగళవారం అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి, గ్రామ అవసరాలకు అనుగుణంగా స్థలాన్ని ఎంపిక చేస్తారని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఆలూరి సురేష్, నరదల పుల్లయ్య, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, రాంప్రసాద్, రాట్నాలరాజు, తిరుపతిరావు, రామకృష్ణ, జమలయ్య, గోపి, సాంబయ్య తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

వారానికో రోజు చేనేత వస్త్రాలు ధరించండి

- అధికారులు, ఉద్యోగులకు కృష్ణా కలెక్టర్ బాలాజీ పిలుపు

మచిలీపట్నం టౌన్: అధికారులు, ఉద్యోగులు వారానికో రోజు చేనేత వస్త్రాలు ధరించి, చేనేత కార్మికులను ప్రోత్సహించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆప్కో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర్, ఆర్డీవో స్వాతి పాల్గొన్నారు. ఆప్కో ద్వారా విక్రయించే దుస్తులను రిబేటుపై విక్రయిస్తున్నారని, అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. చేనేత వస్త్రాలను ధరించి అధికారులంతా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశానికి రావడం అభినందనీయమని డీఆర్వో కె.చంద్రశేఖరరావు పేర్కొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): '60 నుంచి 62 ఏళ్లకు పదవీ విరమణ వయసు పెంచాలి. విధి నిర్వహణలో మృతిచెందిన వర్కర్లకు బీమా సౌకర్యం కల్పించాలి. కుటుంబ సంక్షేమ అధికారులు, యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలపై వెంటనే జీవోలు విడుదల చేయాలి.' అని ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద సోమవారం వారు ధర్నా చేశారు. సీఐటీయూ నాయకులు టి.చంద్రపాల్, సుబ్రహ్మణ్యం ధర్నాకు మద్దతు తెలిపారు. కొత్త రికార్డులు ఏప్రిల్ 1 నుంచి నిర్వహించాల్సి ఉన్నా, ఇప్పటి వరకు సరఫరా చేయలేదని, ఫీల్డ్ వర్కర్ల సెల్‌ఫోన్లు సరిగా పనిచేయడం లేదని, ఇబ్బంది పడుతున్నారని ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు జి.చిట్టికుమారి తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు ఆశ వర్కర్లు వినతి పత్రం సమర్పించారు. ప్రధాన కార్యదర్శి పి.ధనశ్రీ, వై.నాగలక్ష్మి, వి.స్వరూపరాణి పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న 108 కాంట్రాక్టు ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని 108 కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద నిరాహార దీక్ష చేశారు. '108 అంబులెన్స్ వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి. రోజుకు మూడు షిఫ్టులలో ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగుల నియామకాల్లో వెయిటేజీ మార్కులు కల్పించాలి. వైద్య ఆరోగ్యశాఖలో ఈఎస్టీ పోస్టుల నియామకాల్లో 108లో పనిచేస్తున్న వారిని నియమించాలి. వేతనాలు పెంచాలి. ప్రమాదవశాత్తూ కానీ, సహజ మరణం పొందిన ఉద్యోగి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. 108 వాహనాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి. ఉద్యోగులకు బకాయిలను పూర్తిగా చెల్లించాలి.' అని ఏపీ 108 సర్వీసుల కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవికుమార్ డిమాండ్ చేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు టి.చంద్రపాల్, జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు డి.శ్రీహరి, కోశాధికారి కె.శ్యామ్‌కిరణ్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఏపీగా భానుతేజ

- వెయిట్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్‌గా తూర్పుగోదావరి


భానుతేజ

గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 68వ ఎస్జీఎఫ్ అండర్-19 బాల బాలికల అంతర్ జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి వైఎ స్సార్ కడప జిల్లాకు చెందిన డి.భానుతేజ స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఏపీగా ఎంపికయ్యారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబరచి ఓవరాల్ చాంపియన్‌గా తూర్పుగోదావరి జిల్లా నిలిచింది. విజేతలకు వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.దామోదరరావు బహుమతులను అందజేశారు. జిల్లా కార్యదర్శి రవి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి నరేంద్ర, అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ మడకా ప్రసాద్, స్టేడియం కమిటీ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


అవనిగడ్డలో నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నేతలు

సోషల్ మీడియా సైకోలపై చర్యలు తీసుకోండి

అవనిగడ్డ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 'జగన్మోహన్‌రెడ్డి అధికారం కోల్పోయినా సామాజిక మాధ్యమాల్లో వైసీపీ సైకోలు ఇప్పటికీ తల్లి, చెల్లి తేడా లేకుండా వ్యక్తిత్వ హననం చేస్తూ నీచంగా పోస్టులు పెడుతున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.' అని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సజ్జల భార్గవరెడ్డి నేతృత్వంలో వర్రా రవీంద్రరెడ్డి, శ్రీరెడ్డి, పోసాని కృష్ణమురళి, బోరుగడ్డ అనిల్, రాంగోపాల్ వర్మ, పంచ్ ప్రభాకర్, ఇంటూరి రవికిరణ్‌లు సామాజిక మాధ్యమాల్లో పేట్రేగిపోయారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం అవనిగడ్డ వంతెన సెంటర్ నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్‌కు వైసీపీ సోషల్ మీడియా సైకోలపై ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో వైసీపీ పేటీఎం కార్యకర్తలు ఇష్టారీతిన పోస్టులు పెడుతూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని, వారి ఆగడాల కారణంగా ఎంతో మంది తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని, పోలీసులు వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. తెలుగు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి శ్రీనివాసరావు, కూటమి నేతలు యాసం చిట్టిబాబు, గుడివాక శేషుబాబు, మెండు లక్ష్మణరావు, బండే శ్రీనివాసరావు, నడకుదుటి జనార్దనరావు, పైడిపాముల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

శివలింగాకృతిలో దీపోత్సవం

గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దావాజీగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు శివలింగం ఆకారంలో దీపాలను వెలిగించారు. 1100ల బిల్వ దళాలతో విశేష అర్చన చేశారు. ఆలయ ప్రాంగణమంతా దీపోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు రామాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఆధార్.. నో అప్‌డేట్!

- జంక్షన్ పోస్టాఫీసులో మొరాయిస్తున్న స్కానర్
- నిత్యం సూర్యోదయానికి ముందే బారులు తీరుతున్న జనం
- సాయంత్రం వరకు పడిగాపులు
- పట్టించుకోని అధికారులు



జంక్షన్ పోస్టాఫీసు వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం బారులు తీరిన ప్రజానీకం

(హనుమాన్‌జంక్షన్ -ఆంధ్రజ్యోతి)

ఆధార్ .. యూనివర్సల్ గుర్తింపు కార్డు. అది సక్రమంగా లేకపోతే ప్రభుత్వం నుంచి ఏ సాయం అందదు, ఏ బ్యాంకు అకౌంట్ ఇవ్వదు. తెలియక, తెలిసి ఆధార్ కార్డులో తప్పులు నమోదైన, కొత్తగా పుట్టిన పిల్లలకు ఆధార్ కార్డు కావాలన్నా, పేరు తప్పుగా ఉన్నా, ఫోన్ నెంబర్‌కు లింకుచేయాలన్నా పుట్టిన తేదీ మార్చుకోవాలన్నా ఆధార్ కార్డులో పూర్తి డేట్ ఆఫ్ బర్త్ వివరాలు వాటిని సరి చేసుకోవడానికి ఒక్కటే మార్గం ఆధార్ అప్‌డేటా కేంద్రాలు. కాని ఆ కేంద్రాలు మండలానికి ఒకటి కూడా లేకపోవడం, లేదా అవి పనిచేయకపోవడంతో ప్రజలు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. ఆధార్ డేటా కేంద్రం వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి హనుమాన్‌జంక్షన్ పోస్టాఫీసు వద్ద ప్రతి రోజు ప్రజలు పడిగాపులు పడుతున్నారు. ఒక రోజు కాదు... నెలల తరబడి ప్రజలు పోస్టాఫీసు చుట్టూ కాళ్లు అరిగెలా తిరుగుతున్నారు. సూర్యోదయానికి ముందే పోస్టాఫీసు వద్ద బారులు తీరి ఉంటున్నారు. సిబ్బంది 10 గంటలకు వస్తారు. ముందు వరుసలో ఉన్న 30 మందికి దరఖాస్తులు అందజేస్తారు. 10 మందికి ఆధార్ అప్‌డేట్ చేయగానే స్కానర్ ఆలసిపోయి మొరాయిస్తుంది. మిగిలిన వారిని తిరిగి రేపు రండి...అంటూ తిప్పి పంపేస్తున్న పోస్టాఫీసు సిబ్బంది. ఇది హనుమాన్‌జంక్షన్ పోస్టాఫీసులో నిర్వహిస్తున్న ఆధార్ డేటా అప్‌డేట్ కౌంటర్‌లో నెలకొన్న పరిస్థితి. దాదాపుగా కొన్ని నెలలుగా ఇలా సాగుతున్నా అధికారులు గాని, పాలకులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు ప్రజలు పడుతున్న ఇబ్బందిని గమనించి ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని మంజూరు చేయాల్సిన అవసరం ఉందని ప్రజానీకం బావిస్తున్నారు.

పని మానుకుని తిరుగుతున్నాం



పుట్టిన తేదీ మార్చుకోవడానికి దాదాపుగా పది రోజులుగా తిరుగుతున్నాను. బారులు తీరి జనం ఉంటున్నారు. రోజుకు రెండు గంటలు పనిచేయగానే రేపు రండి అంటూ పోస్టల్ సిబ్బంది పంపించేస్తున్నారు. మాట్లాడితే సర్వర్ డౌన్ అంటున్నారు. అధికారులు చొరవ తీసుకోవాలి.

\- శివశంకర్, బాపులపాడు



అన్నసమారాధనలో అడ్వకేట్ గూడపాటి లక్ష్మీనారాయణ దంపతులు

ప్రసాదంపాడు సాయిబాబా గుడిలో అన్నసమారాధన

ప్రసాదంపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది కార్తీకమాసంలో రోజు మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని అడ్వకేట్ గూడపాటి లక్ష్మీ నారాయణ తెలిపారు. సోమవారం గూడపాటి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ప్రసాదంపాడు సాయి బాబా గుడిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రోజు సూమారు 600 మందికి ఉచితంగా భోజనం అందిస్తామన్నారు. డిసెంబర్ 1వ తేదీ వరకూ అన్న సమారాధన జరుగుతుందన్నారు. సోమవారం శివునికి ప్రత్యేకంగా పంచ హారతి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 16 వార్డు మెంబర్ గూడపాటి శివదుర్గ, గూడ పాటి యామిని లక్ష్మీసాయి పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ప్రభావతి

తిరుపతమ్మ సేవా సదన్ నిర్మాణానికి విరాళం అందజేత

గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని తిరుపతమ్మ తల్లి సేవా సదన్ నిర్మాణానికి పట్టణానికి చెందిన కలగర బాలగంగాధర్ తిలక్, ప్రభావతి దంపతులు రూ.50.116 విరాళాన్ని సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, దాతలు, భక్తులు సహకారంతోనే తిరుపతమ్మ తల్లి సేవా సదన్ నిర్మాణం జరుగుతుందన్నారు. జాస్తి శ్రీనివాసరావు, పోట్ల శివలీల బోడపాటి దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

21న పోరంకిలో వైద్యశిబిరం

పెనమలూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : పోరంకి శ్రీనివాసనగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఈ నెల 21న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పటమట పీవీఆర్ గుండె ఆసుపత్రి వైద్యులు తెలిపారు. గుండెవైద్యంతో పాటు ఉచితంగా నరాలు, ఎముకలు, కీళ్ల సమస్యలపై తగు సూచనలు చేస్తారని తెలిపారు. ఆసుపత్రికి చెందిన వైద్యులు అవసరమయిన రోగులకు ఈసీజీ, ఎకో వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తారని తెలిపారు.



నిత్యావసరాలు అందజేస్తున్న పరుచూరి రామకృష్ణ, యార్లగడ్డ వెంకటేశ్వరరావు

నిత్యావసరాలు పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఆపన్నులకు సేవలందిచడమే కేవీఐఎస్ (కమ్మవారి ఐక్య సేవా సమితి) ముఖ్య ఉద్దేశమని అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ తెలిపారు. వేలేరు శివారు, బాపులపాడు చెరువు గట్లపై నివసించే పేదలకు సోమవారం నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశారు. పరుచూరి వైష్ణవి 19వ జయంతి సందర్భంగా నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేసినట్లు రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి శ్రీసత్య ఫణీంద్ర, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, చిగులూరి ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : భక్తులు పరమపవిత్రంగా భావించే కార్తీక మాసంలోని సోమవారం సందర్భంగా శివాలయాలు కిటకిటలాడాయి. పెరికీడు, కానుమోలు, వీరవల్లి, సింగన్న గూడెం, సిరివాడల్లోని శివాలయాల్లో కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

అనధికార లేఅవుట్లలో విద్యుత్ లైన్లు మంజూరుపై ఫిర్యాదు

ఉయ్యూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అనధికార లేఅవుట్లలో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ సర్వీసులు మంజూరు చేయడం వల్ల ప్లాట్లు కొనుగోలు చేస్తున్న మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు.



తహసీల్దార్ శివయ్యకు వినతిపత్రం అందజేస్తున్న డ్వాక్రా మహిళలు

అదనపు చార్జీల వసూలు సరికాదు

యూనియన్ బ్యాంకు ఎదుట డ్వాక్రా మహిళల ధర్నా

గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకులో అదనపు చార్జీలు పేరుతో డ్వాక్రా గ్రూపుల నుంచి అధికంగా నగదు వసూలు చేయటం సరికాదని పలువురు డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక యూనియన్ బ్యాంకులో డ్వాక్రా సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, అదనపు చార్జీలను నిలుపుదల చేయాలని కోరుతూ దావాజీగూడెంకు చెందిన 500 మంది డ్వాక్రా మహిళలు సోమవారం ర్యాలీగా బ్యాంకు దగ్గరకు వచ్చి ధర్నా నిర్వహించాడు. తహసీల్దారుకు కేవి శివయ్యకు, బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సమైఖ్య మాజీ నాయకురాలు గొంది రాణి, నళిని, కల్పన, పల్లమ్మ, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో నిఘా నేత్రాలు

● కోడూరుపాడు కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు



కెమెరాలు పరిశీలిస్తున్న ఎస్సై

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు గ్రామస్థాయి నుంచి చర్యలు చేపట్టే విధంగా కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కోడూరుపాడులోని ప్రధాన రహదారి, జాతీయ రహదారి కూడలి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలను సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామ టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో సీసీ కెమెరాలకు సహకారం అందించినట్లు అధ్యక్షుడు కొండపల్లి వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు గరికపాటి నాగబాబు, భాను, పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.


దళారులను నమ్మి మోసపోకండి



ధాన్యం ట్రాక్టర్‌కు జెండా ఊపి మిల్లుకు తరలిస్తున్న టీడీపీ నాయకులు

కంకిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దు అని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. కంకిపాడు నుంచి సేకరించిన ధాన్యాన్ని జెండా ఊపి ఆయన మిల్లుకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారుల చేతులో రైతులు దగా పడకూడదన్న లక్ష్యంతోనే రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ సమన్వయకర్త ముప్పా రాజా, టీడీపీ నాయకులు పులి శ్రీని వాసరావు, చలవాది రాజా, వణుకూరు విక్రం, షేక్ బాజి, బొప్పూడి శివ రామకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఉప్పలూరు గ్రామంలో సేకరించిన ధాన్యాన్ని టీడీపీ గ్రామ అధ్యక్షులు చలసాని రాధాకృష్ణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు.

ప్రజలపై భారాలు తగ్గించాలి: సీపీఎం



మాట్లాడుతున్న వై.నరసింహారావు

గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై భారాలు వేయడంలో ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. సీపీఎం ఉంగుటూరు మండల మహాసభ మానికొండ సూర్యవతి శ్రామిక భవనంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా అజ్మీర్ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులుగా టీవీ లక్ష్మణస్వామి, పులి శ్రీనివాసరావు, షేక్ మహ్మద్ గలాబ్, శ్రీనివాసరావు, రమణ, మహేష్, రామ్మోహనరావు, జగన్మోహన రావు, సాంబశివరావు, ప్రభాకర్, రామరాజులు సభ్యులుగా ఎన్నుకున్నారు.

పెనమలూరు : పెనమలూరు మండల సీపీఎం నూతన కార్యదర్శిగా ఎస్కే కాసింను ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన మండల సీపీఎం కమిటీ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వై నరసింహరావు తెలిపారు. 11మంది సభ్యులతో మండల కమిటీని ఎన్నుకొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన



అవగాహన ర్యాలీలో విద్యార్థులు

పెనమలూరు, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఐఈఈఈ-సీఎస్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రామవరప్పాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రూప మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫోన్ నంబరు, ఈమెయిల్ పాస్‌వర్డ్ ఎలా జాగ్రత్త పరచుకోవాలో తెలిపారు. కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం తాయారు, ప్రోగ్రాం అధికారి కొల్లా నరేంద్ర పర్యవేక్షించారు.

మొబైల్ భద్రతపై అవగాహన



ఉయ్యూరు : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో విద్యార్థులకు మొబైల్ భద్రత అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. మాల్వేర్, ఫిషింగ్, డేటాలీకేజి, ఇతర మొబైల్ బెదిరింపు నుంచి రక్షణ అందించే అధునాతన భద్రతా పరిష్కారంపై డి.సాయిసతీశ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ సవివరంగా తెలియ జేశారు. మాల్వేర్ అంటే డేటాను దొంగిలించడానికి కార్యచరణకు ట్రాక్ చేయడానికి, పరికరాన్ని పాడుచేయడానికి రూపొందించబడిన హానికరమైన సాఫ్ట్‌వేర్ అన్నారు. ఇంజనీరింగ్ వ్యక్తిగత సమాచారాన్ని అడిగే ఆయాచిత సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, కంప్యూటర్‌శాఖ అధిపతి సీహెచ్ అనిల్‌కుమార్, టి. నాగప్రసాద్, ఎస్. ప్రభావతి, షర్మిలాబేగం పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో రోడ్లు అభివృద్ధి చేయాలి



ఎంపీడీవో స్వర్ణలతకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్సీ కాలనీలోని రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో స్వర్ణలతకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. మాల, మాదిగలతో పాటు యానాదులు కూడా ఉంటున్నారని సరైన. రోడ్లు, డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. శివ, విజయరాజు, ఏసుపాదం, మల్లేశ్వరీ, నక్షత్రం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి



తిరుమలరావు

ఆటోనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఆటోనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. డిపో మేనేజర్ తెలిపిన వివరాల మేరకు.. ఉయ్యూరుకు చెందిన తిరుమలరావు(49), ఆటోనగర్ డిపోలో 12 ఏళ్లుగా ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నా డు. ఈ క్రమంలో కర్నూలు జిల్లా త్రిపురాంతకం మండలం సమీపంలోని కేశినేనిపల్లి జంక్షన్ వద్ద సోమవారం జాతీయ రహదారిపై ఓ వృద్ధుడని తప్పించబోయి టిప్పర్‌ని ఢీకొట్టాడు. దీంతో బస్సు ముందు భాగంలో ఇరుక్కుపోయిన తిరుమలరావు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

నేడు వ్యవసాయ విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉయ్యూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గంగూరు 132 కేవీ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు ఉయ్యూరు సబ్‌డివిజన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ వినియోగాదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ట్లు ఏపీసీపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణనాయక్ తెలిపారు. గండిగుంట, ఎగినపాడు, నాగన్నగూడెం, కాటూరు, పెదఓగిరాల, ఆకునూరు, చినఓగిరాల, కలవపాముల, కడవకొల్లు, రొయ్యూరు, వల్లూరుపాలెం, బొడ్డపాడు, తోడెళ్లదిబ్బ, తోట్లవల్లూరులంక, పాములలంక గ్రామాల పరిధిలో వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పోస్టల్ బ్యాంక్ ఖాతాల పరిశీలన



ఉయ్యూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ఖాతా లేని 18 సంవత్సరాల వయస్సు నిండినవారికి గ్రామ సచివాలయాల్లో పోస్టల్ బ్యాంక్ ఖాతా తెరిచేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఉయ్యూరు ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు అన్నారు. గండిగుంట, కలవపాము, కాటూరు గ్రామస చివాలయాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాంక్ ఖాతా తెరచే కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఎంపీపీ చీలి కల్పన, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఏఓ కొలుసు శివశంకర్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో నాయకులు వెలగపూడి , బోడె వెంకట్రామ్, షేక్ బుజ్జి

కానూరులో టీడీపీ సభ్యత్వ నమోదు

పెనమలూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. అన్ని గ్రామాల్లో స్థానిక నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకు వెళతున్నారు. సోమవారం కానూరు సనత్‌నగర్ మదీనా మసీద్ 32వ డివిజన్లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకర బాబు, యువనేత బోడె వెంకట్రామ్, టీడీపీ కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి, టీడీపీ రెహమాన్, రియాజ్, రఫీ, హుస్సేన్, మతిన్ పాల్గొన్నారు.



యువ ఉత్సవ్-2024 పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

యువ ఉత్సవ్-2024 పోస్టర్ ఆవిష్కరణ

వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువ ఉత్సవ్-2024 పోస్టర్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆవిష్కరించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్‌భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా యూత్ కో ఆర్డినేటర్ సుంకర రాము ఎంపీని కలిశారు. ఈ నెల 23వ తేదీన ఎనికేపాడులోని విజయ మహిళల ఇంజనీరింగ్ కాలేజీలో జరగనున్న యువ ఉత్సవ్-2024 గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బి.వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పెనమలూరులో పొలం పిలుస్తోంది

పెనమలూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు వ్యవసాయ శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో పెనమలూరు, చోడవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని మొక్కజొన్న, మినుము, అల్లం పంటలను పరిశీలించారు. ఏఓ కే శైలజ, వీఏఏలు వంశీ, అనూష పాల్గొన్నారు.

బస్టాండ్ సినిమాను బతికించండి!

కొవిడ్‌తో పీఎన్‌బీఎస్‌లో మూతపడిన సినిమా థియేటర్లు ● ఆపన్నహస్తం అందించకపోవటంతో రెండేళ్లుగా మూత



పీఎన్‌బీఎస్‌లో వైస్ర్కీన్స్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఆసియాలోనే రెండో అతిపెద్దదైన పండిట్ నెహ్రూ బస్టేషన్ (పీఎన్‌బీఎస్)లో వినోదం నిలిచి చాలా కాలమైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన థియేటర్ల కాన్సెప్ట్ అచిరకాలంలోనే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేలా చేసి పీఎన్‌బీఎస్‌ను ఓ వినోద కేంద్రంగా మార్చేసింది. ఈ స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా బస్టేషన్లను వినోద కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించారు. తద్వారా కమర్షియల్ యాక్టివిటీ పెరుగుతుందని, ఎందరికో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు విస్తృతమౌతాయన్న ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వం ఈ వినూత్న ఆలోచన చేసింది. అప్పట్లో రెండు మినీ సినిమా థియేటర్ల ఏర్పాటుకు 'వై స్ర్కీన్స్' అనే సంస్థ ముందుకొచ్చి ఏర్పాటు చేసింది. దీంతో ఇక్కడ సినిమా చూడటానికి ఆసక్తి చూపించారు. ప్రయాణీకులే కాకుండా బయట నుంచి కూడా పెద్ద సంఖ్యలో పీఎన్‌బీఎస్‌లోని మినీ థియేటర్లలో సినిమా చూడటానికి వచ్చేవారు. కృష్ణా పుష్కరాల సందర్భంలో అయితే ఈ థియేటర్లు ఓ వెలుగు వెలిగాయనే చెప్పవచ్చు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా కొంతకాలం మనగలిగాయి. కొవిడ్ రావటంతో సినిమా థియేటర్లను తెరవలేని పరిస్థితి నెలకొంది. దీంతో యజమానులు తీవ్ర నష్టాల పాలయ్యారు. తదనంతరం ఇవి సిక్ ఇండస్ట్రీ జాబితాలోకి చేరిపోయాయి. సరిగ్గా ఈసమయంలోనే వెంటిలేటర్ పైనున్న పరిశ్రమలకు ఆపన్నహస్తం అందించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదేమో? నిర్వహణ భారం, నష్టాలతో వై స్ర్కీన్స్ సంస్థ కునారిల్లి మూతపడింది. రెండేళ్లుగా పీఎన్‌బీఎస్‌లో ఎలాంటి వినోదం లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సిక్ ఇండస్ట్రీలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారి సమస్యలేమిటో తెలుసుకుని మరోమారు వారికి అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. నిబంధనల మేరకు నిర్వాహక సంస్థ లేచి నిలబడటానికి అండ గా ఉండటంతో పాటు, గతంలో సృష్టించిన ఈ కొత్త ఒరవడిని కొనసాగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బస్టేషన్‌లో బస్సుల కోసం ఎదురు చూపు లు చూసేవారికి ఈ థియేటర్లు వినోదాన్ని పంచేవి. పండుగల సందర్భంలో కళాశాలలకు అవుటింగ్ ఇచ్చినపుడు బస్టేషన్‌లోని క్లోక్ రూముల్లో సామగ్రిని పెట్టి నగరంలోకి వెళ్లి సినిమాలు చూసి తర్వాత ఇంటికి వెళ్లేవారు. పీఎన్‌బీఎస్‌లో థియేటర్ల ఏర్పాటు తర్వాత నగరంలోకి వెళ్లకుండానే ఎంచక్కా పీఎన్‌బీఎస్‌లోనే సినిమాలు చూసే అవకాశం కలిగింది. ఇతర ప్రాంతాల నుంచి అనేక పనుల మీద నగరానికి వచ్చిన వారు త్వరగా తమ పనులు పూర్తి చేసుకుంటే తాము బస్సెక్కటానికి 2, 3 గంటల సమయం ఉందనుకుంటే బస్టేషన్‌లోని థియేటర్లకు వెళ్లి టైమ్‌పాస్ చేసేవారు. విశ్రాంతి తీసుకుందామనుకుంటే డార్మిటరీలుంటాయి. తినాలంటే హోటల్స్ ఉన్నాయి. వినోదం పొందాలనుకుంటే థియేటర్లు ఉంటాయి. అన్నీ ఒకే గొడుగున ఉండటంతో ప్రయాణికులు బస్టేషన్‌లో ఎక్కువ సేపు గడిపేవారు. దీంతో కమర్షియల్ యాక్టివిటీ ఎక్కువగా జరిగేది. కమర్షియల్ యాక్టివిటీ పతాక స్థాయికి చేరుకోవటానికి ఈ థియేటర్లేనని చెప్పవచ్చు. పీఎన్‌బీఎస్‌ను మళ్లీ గతంలో మాదిరిగా ఎంటర్‌టైన్‌మెంట్ స్టేషన్‌గా తీర్చిదిద్దాలంటే థియేటర్లను తెరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దుర్గమ్మ సన్నిధిలో శైలజ రామయ్యర్

వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను సోమవారం తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ దర్శించుకున్నారు. ఆమెకు ఈఈ కేవీఎస్ కోటేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారికి చిత్రపటం, ప్రసాదం, శేష వస్త్రం అందజేయగా వేద పండితులు ఆశీస్సులు అందజేశారు.



శైలజ రామయ్యర్‌కు ప్రసాదం ఇస్తున్న అధికారులు

దుర్గమ్మకు కానుకగా వెండి కిరీటం



ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు ద్రాక్షారామానికి చెందిన కొమ్ముల స్వామినాయుడు, ఆయన కుటుంబ సభ్యులు సోమవారం ఆలయానికి వచ్చి 1300 గ్రాముల బరువు కలిగిన వెండి కిరీటాన్ని కానుకగా ఇచ్చారు. అధికారులను కలిసి దేవస్థానానికి కిరీటాన్ని అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాతకు, కుటుంబ సభ్యులకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

యథావిధిగా విజయవాడ - గూడూరు రైలు

రైల్వేస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 12744 విజయవాడ - గూడూరు, 07500 విజయవాడ - గూడూరు రైళ్లను మంగళవారం నుంచి యథావిధిగా నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లను పెదవడ్లపూడి - దుగ్గిరాల స్టేషన్ల మధ్య ట్రాఫిక్ బ్లాక్ అయిన కారణంగా దారి మళ్లించారు. ఇక సాధారణ మార్గంలోనే ఈ రైళ్లు నడుస్తాయని ప్రకటనలో తెలిపారు.

18 మంది మహిళల ఆచూకీ గుర్తింపు

విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఇళ్ల నుంచి వెళ్లిపోయిన మహిళల ఆచూకీని ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు గుర్తించారు. వారం వ్యవధిలో మొత్తం 18 మంది మహిళలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కమిషనరేట్ పరిధిలో మహిళలు, బాలికలు, అమ్మాయిల మిస్సింగ్ కేసులను ఛేదించడానికి అధికారులు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం వారం వ్యవధిలో 18 మంది ఆచూకీని గుర్తించింది. ఇన్‌స్పెక్టర్ పుల్లా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఒక టీం మిస్సింగ్ కేసుల దర్యాప్తులో నిమగ్నమైంది. మాచవరం, పటమట, గుణదల, కొత్తపేట, భవానీపురం, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో ఈ పురోగతి సాధించారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 121 మిస్సింగ్ కేసులుండగా వాటిలో 18 కేసులను పోలీసులు ఛేదించారు. మిగిలిన 103 కేసులను త్వరలో ఛేదిస్తామని పోలీసులు తెలిపారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

● 4 కేజీల గంజాయి స్వాధీనం

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కేజీఎఫ్ అపార్టుమెంట్ వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది అపార్టుమెంట్ ప్రాంతంలో సోదాలు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న తమ్మిన నాగ దుర్గారావు (23), కట్టా విజయేంద్రరాజు అలియాస్ పిత్తా (19)తో పాటు మరో ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

గుర్తించని, తీసుకువెళ్లని పార్శిళ్ల బహిరంగ వేలం

బస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ పార్శిల్ ఆఫీసులో చిరునామాదారులు తీసుకువెళ్లని లేదా గుర్తించని పార్శిళ్లను ఈనెల 22న బహిరంగ వేలం వేయనున్నట్టు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్), సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్ ఆవరణలోని పార్శిల్ ఆఫీసు వద్ద వేలం జరుగుతుందన్నారు. ఆసక్తిగల పాటదారులు పాల్గొనాలని కోరారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి

● టీడీపీ, జనసేన నేతల ధర్నా



అక్రమ నిర్మాణాలపై గతంలో పత్రికల్లో వచ్చిన ప్రతులతో ధర్నా నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నేతలు

రామలింగేశ్వరనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో పడవల రేవు వద్ద కర్మల భవనం నిర్మిస్తానని తండ్రి హామీ ఇవ్వగా కుమార్తె మాత్రం అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి షాపులు నిర్మించి అద్దెకివ్వడం అధికారాన్ని దుర్వినియోగం చేయడమేనని కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ అన్నారు. సోమవారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ పడవల రేవు బ్రిడ్జి వద్ద బందరు కాలువ పక్కన ప్రభుత్వం స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలు తొలగించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ కార్పొరేటర్ ఆళ్ల చల్లారావు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ చేసిన అక్రమాలు చాలా ఉన్నాయని అందుకు ఉదాహరణ వంతెన పక్కనే నిర్మించిన షాపులేనన్నారు. వాళ్ల అరాచకాలు టీడీపీ, జనసేన పార్టీలపై రుద్దాలని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గా చూస్తున్నారని, వాళ్ల అక్రమాల కారణంగానే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ కార్పొరేటర్లుగా ఉన్నా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు భారీ మెజారిటీ వచ్చిందన్నారు. ఇప్పటికైనా అవాస్తవాలు ప్రచారం చేయడం మానుకోవాలని లేకుంటే వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవన్నారు. ఈ అక్రమ నిర్మాణంపై కార్పొరేషన్ తన పని తానుచేసుకుని పోతుందని, డివిజన్‌లో అన్ని అక్రమాలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం జనసేన డివిజన్ అధ్యక్షుడు గాదిరెడ్డి అమ్ములు మాట్లాడుతూ వంతెన వద్ద గతంలో 15 కుటుంబాలు నివాసం ఉండడంతో పాటు ఇక్కడ మహిళలు చిరువ్యాపారాలు చేసుకునే వారిని బెదిరించి అక్కడి నుంచి తొలగించి డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గా షాపులు నిర్మించి అద్దెకిచ్చారన్నారు. వెంటనే వాటిని తొలగించి గతంలో ఇచ్చిన హామీ ప్రకారం డివిజన్ వాసుల అవసరాల కోసం కర్మల భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమ నిర్మాణ పై అప్పుడే ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదని కానీ ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వంలో అధికారులకు అన్ని హక్కులు ఇవ్వడంతో చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఈశ్వర్, ఈశ్వరరావు, బహదూర్, రమేష్ ఇతర టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

భక్త కనకదాస కీర్తనలు

ప్రజా చైతన్యానికి సూచికలు

● ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



భక్త కనకదాస చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా సంగీత సాహిత్యాలతో అనుసంధానం చేసి తత్వజ్ఞానాన్ని అందించేందుకు, తన కీర్తనలతో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు, విశేష కృషి చేసిన కవి, సంగీతకారుడు, స్వరకర్త శ్రీ భక్త కనకదాస జీవితం ఆదర్శప్రాయమని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అన్నారు. శ్రీ భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కన్నడ కురుబ కుటుంబంలో జన్మించిన కనకదాస విద్య ద్వారా జ్ఞానాన్ని సముపార్జించి సమాజాన్ని అన్ని కోణాల్లో సూక్ష్మ పరిశీలన చేసి, అర్థం చేసుకొని వైవిధ్య రచనలు చేసి సమాజానికి దిశానిర్దేశం చేశారని, ఆయన మనకందించిన జ్ఞానాన్ని వారసత్వ సంపదను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని నిధి మీనా అన్నారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా ఇన్‌చార్జి బీసీ సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ జి.ఉమామహేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్ పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి

శారదాపీఠ ఉత్తరాధికారి పూజలు



రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భారతి స్వామి

విజయవాడ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీ శృంగేరీ శారదా పీఠ ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతీ స్వామి సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రంలో నూతనంగా నిర్మించిన శారదా సదనం, ధార్మిక భవనాలను ప్రారంభించారు. అనంతరం విద్యాభారతీ శ్రవణ సదనము ధర్మాధికారి దంపతులు కుందుర్తి మాధవి, శిష్టా శ్యామల, జొన్నవిత్తుల ప్రభాకరశాస్త్రి, గండూరి చంద్రమౌళీశ్వర సాంబమూర్తి పాల్గొన్నారు. మారుతీ వ్యాయామశాలను దర్శించి హనుమంతుడికి పూజలు నిర్వహించారు. తదుపరి కార్తీక సోమవారం పూజ నిర్వహించారు. భక్తులకు శ్రవణ సదనంలో దర్శనం ఇచ్చి, ఆశీర్వచనాలు అందించారు. సాయంత్రం చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు పూజలు చేశారు.

యనమలకుదురు శివాలయంలో..

శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసం 3వ సోమవారాన్ని పురస్కరించుకొని ఉదయం శ్రీ విధుశేఖర భారతీ స్వామి మహాకుంభాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శివాలయంలో రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి హారతులు అందించారు. ట్రస్ట్ ఫౌండర్ సంగా నర్సింహారావును సత్కరించారు. కార్యనిర్వాహణాధికారిణి ఎన్.భవానీ పాల్గొన్నారు.



విజేతలతో కళాశాల డీన్ రాజేష్, పీడీ కృష్ణారెడ్డి

ఘనంగా అంతర్ వర్సిటీ యోగా చాంప్

విజయవాడ స్పోర్ట్సు నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ సైన్స్ కళాశాల ఆతిథ్యంలో సోమవారం కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల, మహిళల యోగా చాంపియన్‌షిప్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ట్రెడిషనల్ యోగాలో జోత్స్నదేవి, మౌనిక, దీపిక వరుసగా స్వర్ణ, రజత, కాంస్యాలను సాధించారు. పురుషుల విభాగంలో వరుణ్ (నలంద), రాకేష్ (కేబీఎన్), గౌరీనాథ్ (కేబీఎన్) స్వర్ణ, రజత, కాంస్యాలను వశం చేసుకున్నారు. అనంతరం కృష్ణా వర్సిటీ టీమ్‌ను ఎంపిక చేశారు. పురుషుల్లో పీఎస్ రాజు, వరుణ్, రాకేష్, గౌరీనాథ్, శంకర్, ప్రవీణ్‌కుమార్, మహిళా టీమ్‌కు జోత్స్నదేవి, మౌనిక, దీపిక, కృతి, సమీర, టెహరీన్ ఎంపికయ్యారు. కళాశాల డీన్ రాజేష్, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీబీ కృష్ణారెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో అజీజ్

జాతీయ బాస్కెట్‌బాల్‌కు అమల్‌రెడ్డి, నిరంజన్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం పాటియాలాలో ఈ నెల 20 నుంచి 26 వరకు జరిగే జాతీయ స్కూల్‌గేమ్స్ బాస్కెట్‌బాల్ టీమ్‌కు బాలుర నుంచి అమల్‌రెడ్డి, నిరంజన్ రాయల్, బాలికల నుంచి షేక్ ఉమ్మహప్సా ఎంపికయ్యారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో ప్రతిభ చాటి ఎంపికయ్యారు. ఈ ముగ్గురు క్రీడాకారులు ఐజీఎంఎస్‌లోని శాప్ బాస్కెట్‌బాల్ కోచ్ సంతోష్‌కుమార్ వద్ద శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా కోచ్, క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ సోమవారం అభినందించారు.

ఏషియన్ చెస్ పోటీల్లో కార్తీక్‌కు స్వర్ణం



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో బికనేర్‌లో ఈ నెల 10 నుంచి 18 వరకు జరిగిన రెండో ఏషియన్ చెస్ చాంపియన్‌షిప్ ప్లేయర్స్ విత్ డిజేబులిటీస్‌లో విజయవాడకు చెందిన డిజేబుల్డ్ ప్లేయర్ వెంకట కృష్ణకార్తీక్ స్వర్ణంతో సత్తా చాటాడు. 7 దేశాల క్రీడాకారులు 9 రౌండ్ల పోరులో తలపడగా కార్తీక్‌కు 6 పాయింట్లతో స్వర్ణం లభించింది. మరో ప్లేయర్ సమర్థ్ జే రావుకు 6 పాయింట్లు రాగా అతడికి రజతం లభించింది. కార్తీక్‌ను గ్లోబల్ చెస్ అకాడమీ నిర్వాహకులు షేక్ ఖాసీమ్ అభినందించారు.



దుర్గా బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

డిపాజిటర్ల ఆర్థిక ప్రయోజనాలు కాపాడాలి

● ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. ఇటీవల రిజర్వ్ బ్యాంకు ఆంక్షలు విధించిన దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును సోమవారం ఆయన సందర్శించారు. డిపాజిటర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, సీఈవో బంకా శ్రీనివాస్‌తో కలిసి చర్చించారు. బ్యాంకులోని అవకతవకలు గురించి, డిపాజిటర్లతో, బ్యాంకు సిబ్బందితో మాట్లాడి బ్యాంకు ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నారు. డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశం ఇవ్వాలని ఖాతాదారులు ఎమ్మెల్యే సుజనాకు విన్నవించుకున్నారు. డిపాజిటర్లకు చెల్లించాల్సిన నగదు, డిఫాల్టర్ల లిస్టు, ఆస్తులు, అప్పులు, తదితర అంశాలపై సమీక్షించి సమాచారాన్ని సేకరించారు. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్‌తో మాట్లాడి డిపాజిటర్లకు ఇన్సూరెన్స్ అమౌంట్ అందేవిధంగా ఎమ్మెల్యే సుజనా ప్రయత్నం చేస్తానన్నారు. సుజనా వెంట ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్పోర్ట్స్ మీట్‌కు కృషి

● ఎంపీ కేశినేని శివనాథ్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి ఏడాది స్పోర్ట్స్ మీట్ నిర్వహించేలా కార్యాచరణ చేయనున్నట్టు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల, కాలేజీల ఫిజికల్ సంచాలకులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సోమవారం కేబీఎన్ కళాశాలలో డీఈవో యూవీ సుబ్బారావు సహకారంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది క్రిస్మస్, సంక్రాంతి సెలవుల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిసెంబర్ 17 నుంచి 2025 జనవరి 15 వరకు స్పోర్ట్స్ మీట్‌లు నిర్వహించాలనుకున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి క్రీడలు నిర్వహించాలనేదానిపై సూచనలు, సలహాలు తీసుకున్నారు. క్రీడా వసతులు లేని పాఠశాలల వివరాలను ఆయన సేకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పాఠశాలల్లో విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా పాఠశాలల్లో క్రీడా వసతులు కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని, గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తేవాలని సంకల్పించామన్నారు. 2027లో అమరావతి ప్రాంతానికి జాతీయ క్రీడలను తెచ్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఈ క్రమంలోనే అమరావతిలో స్పోర్ట్స్ సిటీని ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. స్పోర్ట్స్ వర్సిటీ కూడా రాబోతుందన్నారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచి ప్రోత్సహించాలన్నారు. డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ శివనాథ్‌కు అన్ని విధాలుగా తాము సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఓఎస్‌డీ వెంకట రత్నం, కేబీఎన్ కాలేజీ సెక్రటరీ టి.శ్రీనివాస్, హిందూ హైస్కూల్స్ కమిటీ పరిపాలన అధికారి వి.నారాయణ రావు, మాజీ శాప్ చైర్మన్ అంకమ్మ చౌదరి, ఎన్టీఆర్ జిల్లా ఎస్‌జీటీ సెక్రటరీ ఎస్.శ్రీనివాస్, నందిగామ నియోజకవర్గ ఎస్‌జీటీ కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు

సంయుక్త సమావేశాలు నిర్వహించాలి

బస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థలో బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించటానికి సంయుక్త సమావేశాలు నిర్వహించాలని ప్రజా రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను కోరారు. సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ నాయకత్వంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరిరావు ఆధ్వర్యంలో ఆర్టీసీ హౌస్‌లో చైర్మన్‌ను కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి, దుశ్శాలువాతో అభినందించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆయనకు విన్నవించారు. బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు జాతీయస్థాయిలో నెలకు ఒకసారి ఆర్టీసీ హెడాఫీసులో సమావేశాలు నిర్వహించేవారని, గత ప్రభుత్వం ఈ సమావేశాలు నిర్వహించలేదని, ఇప్పుడు మళ్లీ పునరుద్ధరించాలని, బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటపతి, నేతలు కె.లక్ష్మణుడు, పి.సూరిబాబు, వి.జానకిరామ్, వి.వెంకటేశ్వరరావు, ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.



డ్రోన్ ఆపరేషన్ గురించి వివరిస్తున్న సీపీ

మహిళా పోలీసులకు డ్రోన్ శిక్షణ

విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు డ్రోన్ ఆపరేషన్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఎంజీ రోడ్డులో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ శిక్షణ సదస్సును సీపీ రాజశేఖరబాబు సోమవారం ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ హనీష్‌బాబు పాల్గొన్నారు.

పీఎఫ్, అధిక పెన్షన్ల సమస్యలు పరిష్కరించాలి

● రవాణా శాఖ కమిషనర్‌కు ప్రజా రవాణా సంస్థ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ లేఖ

బస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులకు సంబంధించి పీఎఫ్, హయ్యర్ పెన్షన్ అమలులో వస్తున్న అనేక సమస్యలను పరిష్కరించాలని రవాణా శాఖ కమిషనర్‌కు సోమవారం ప్రజా రవాణా సంస్థ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ లేఖ రాసింది. గౌరవాధ్యక్షుడు ఎస్.కె.జిలానీ బాషా, ప్రచార కార్యదర్శి టి.పి.ఆర్ దొరలు సంతకం చేసిన లేఖలో ఏపీ, తెలంగాణ ఆర్టీసీలో 8,934 మంది వద్ద హయ్యర్ పెన్షన్ కోసం 1996-2014 మధ్యకాలంలో వసూలు చేసిన డబ్బుల్లో సాధారణ చెల్లింపులు పోను, మిగతా డబ్బులు వారి వ్యక్తిగత ఖాతాలకు వడ్డీతో సహా చెల్లించాలని, అనేక సార్లు విజ్ఞప్తి చేశామన్నారు. కానీ అధికారులు ఆర్‌పీఎఫ్‌సీ ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్టు లేదన్నారు. 2021లో కొందరి పేరుతో ఒక లేఖ, తరువాత మరో లేఖ ద్వారా కార్మికుడు ఆర్‌పీఎఫ్‌సీకి పంపారని, అది కేవలం లేఖ మాత్రంగా రికార్డుల్లో ఉందన్నారు. 8,934 మందికి సంబంధించి అధిక పెన్షన్ చెల్లింపులు గురించి ఎలాంటి సమాచారం లేక ఇప్పటికీ జరుగుతున్న అన్యాయం, నష్టం తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యలపై తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అక్కడి యాజమాన్యంతో సంప్రదించిందని, ఏపీఎస్‌ఆర్టీసీ కూడా ఉద్యోగుల నుంచి అదనంగా వసూలు చేసిన కోట్లాది రూపాయలను రికవరీ చేసి ఉద్యోగులకు ఇప్పించాలని కోరారు. ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-1కు లేఖలు రాసి అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

విష్ణుకుమార్ రాజుకు సత్కారం



విష్ణుకుమార్ రాజును సత్కరిస్తున్న నేతలు

బస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా రవాణ మంత్రిని కోరిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును ప్రజా రవాణ సంస్థ ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ విజయవాడ జోన్ కమిటీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్, సీసీఎస్ పాలక వర్గ సభ్యుడు అనంతరాములు, విజయవాడ జోనల్ కార్యదర్శి అడపా రామారావు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు

● కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బందికి కలెక్టర్ బాలాజీ సోమవారం క్లాస్ తీసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో షరామామూళ్లే అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. తహసీల్దార్ మధుసూదనరావుతో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బందిని తన చాంబరుకు పిలిచారు. పనితీరు మార్చుకోవాలని, ఇదేపద్ధతిలో నడిస్తే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో స్వాతి కలెక్టర్‌తో పాటే ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.575

చెత్త సేకరణలో అలసత్వం వహిస్తే చర్యలు



గుడివాడ, నవంబరు18(ఆంధ్రజ్యోతి) : చెత్త సేకరణలో మున్సిపల్ సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలో పారిశుధ్య పనులను అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. రాజేంద్రనగర్‌లోని మున్సిపల్ పార్కును శుభ్రపరిచారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీను అందుకుంటున్న కమిషనర్

మీకోసంలో నాలుగు అర్జీలు

గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో నాలుగు అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. డంపింగ్ యార్డు, నాగవరప్పాడులో ఆక్రమణలు, ఆర్టీసీ కాలనీలో చెట్ల కొమ్మలను తొలగించాలని వంటి అంశాలపై అర్జీలు వచ్చినట్టు తెలిపారు.

నేటి నుంచి 30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల నిమిత్తం ఈనెల 19వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పట్టణ పరిధిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాకమిటీ

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పమిడిముక్కల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తాడింకి జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్ఎం వైఎస్ఎన్ ప్రసాద్, స్థానిక ప్రముఖుడు మస్తాన్‌రావు అన్నారు. స్థానిక పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయులు రవి కుమా ర్, రాజ్యలక్ష్మి, ఝాన్సీ ఆధ్వర్యంలో సైన్స్ స్టడీ మెటీరియల్ సోమవారం పంపిణీ చేశారు. జక్కా శ్రీనివాసరావు, చింతా భాస్కర రావు, అంజనేయులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో నరకం!

(పమిడిముక్కల - ఆంధ్రజ్యోతి)

పమిడిముక్కల మండల పరిధిలో విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపక్కన సర్వీసు రోడ్లు గుంతలమయం కావడంతో ప్రజలు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. జాతీయ రహదారి పక్కన తాడంకి నుంచి గోపువానిపాలెం, మర్రివాడ, సాయిపురం, జబర్లపూడి గ్రామాలకు వెళ్లే సర్వీసు రోడ్డు అండర్ పాస్ సమీపాన పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురజాడ చెరువు సమీపాన సర్వీసు రోడ్డు కొంతమేర గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారుల సంస్థ ఆధీనంలో ఉన్న సర్వీసు రోడ్లు సైతం గుంతలతో ప్రమాదకరంగా తయారైనా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ముక్కుపిండి టోల్ గేట్ వసూలు చేసే జాతీయ రహదారుల సంస్థ సర్వీసు రోడ్లను పట్టించుకోపోవడం ఏమిటని గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తాడంకి అండర్‌పాస్ సమీపాన గోపువానిపాలెం వెళ్లే సర్వీసు రోడ్డుపై గుంతలు

గుడివాడ బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గత 20 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక గుడివాడ బస్టాండ్ దారుణంగా ఉందని, కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. బస్టాండ్ దుస్థితిని ఫొటోలతో సహా వివరించారు. చిన్నపాటి వర్షానికే బస్టాండ్ మునిగిపోతుందని, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర రవాణ శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలోని అన్ని బస్టాండ్‌లను ఆధునీకరించి, అభివృద్ధి పరుస్తామని హామి ఇచ్చారు.



పీఏసీఎస్ సిబ్బందిని సత్కరిస్తున్న జిల్లా సహకార అధికారి చంద్రశేఖరరెడ్డి

కంప్యూటరీకరణలో వల్లూరుపాలెం పీఏసీఎస్‌కు ప్రథమ స్థానం

తోట్లవల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటరీకరణలో వల్లూరుపాలెం పీఏసీఎస్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా సహకార అధికారి కె చంద్రశేఖరరెడ్డి అన్నారు. వల్లూరుపాలెం పీఏసీఎస్‌లో సోమవారం జరిగిన సహకార వారోత్సవ చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. డిజిటలైజేషన్‌లో సిబ్బంది కృషిని అభినందించారు. పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి తోట బాలకృష్ణ, సూపర్‌వైజర్ శివ నాగరాజు, పీఐసీ దాసరి అలంకార్‌ను ఘనంగా సత్కరించారు. గుడివాడ డివిజన్ సహకార అధికారి వివి ఫణికుమార్, జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్యామ్ మనోహర్, జిల్లా కేడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఏజీఎం గణేష్ కుమార్, ఆప్కాబ్ డీజీఎం షేక్ అప్సర్ జిహాన్, తోట్లవల్లూరు కేడీసీసీ బ్రాంచి మేనేజర్ సీహెచ్ భానూష, ఏపీ రాష్ట్ర సహకార యూనియన్ జోనల్ విద్యాధికారి కె.భోజరంగ రాజు, ఏసీఎం డి సింధూజ, మౌనిక పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ సుభాన్

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

పామర్రు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీఎస్టీ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని గుడివాడ ఇన్‌చార్జి డీఎస్పీ ఎండీ సుభాన్ అన్నారు. ఆరేపల్లి కల్యాణ మండపంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సందేశమిచ్చారు. ఎస్సీఎస్టీలపై జరిగే దాడులు, అత్యాచారాల పూర్తిగా అంతరించాలంటే చట్టాలు పకడ్బందీగా అమలు కావాలన్నారు. పీపీ కె.చంద్రశేఖర్, సీఐడీ రీజనల్ సీఐ పిరాజేష్ మాట్లాడుతూ, చట్టాలపై అవగాహన కల్పించే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఎంపీడీవో కె.జ్యోతి ఎస్సీ ఎస్టీలపై అమాయిత్యాలు జరిగినప్పుడు ఏ విధంగా ఫిర్యాదు చేయాలి, న్యాయ సేవలు ఎలా పొందాలో వివరించారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులందజేశారు. సర్పంచ్ కె.కస్తూరి అధ్యక్షతన జరిగిన సదస్సులో తహసీల్దార్ రవికాంత్, ఎంఈవో పద్మవాణి, సీఐడీ మహిళ విభాగం అధికారి పి.శిరీష, డివిజన్ ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు వెంకట కృష్ణ,బి.మోహనరావు, సీఐడీ సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్సైలు ఎండి రుహాల్లా, పామర్రు ఎస్సై సిహెచ్ అవినాష్, ఎస్సీ నేతలు నందిపు నాగేంద్ర, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భక్తుల దీపారాదనలు, దర్శనాలతో కిటకిటలాడుతున్న పామర్రు శివాలయం

మార్మోగిన శివనామస్మరణ

గుడివాడ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మూడో సోమవారం భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పెద్ద శివాలయం, చిన్న శివాలయాల్లో తెల్లవారు జామున 4గంటల నుంచే దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. **పామర్రు :** పామర్రు శివాలయం భక్తులతో పోటెత్తింది. ఉసిరి, జమ్మి, తులసి వృక్షాల వద్ద సామూహిక కార్తీక దీపారాదనలు చేశారు. పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. అయ్యప్ప, భవాని, శివమాల దీక్షపరులు పాల్గొన్నారు.



వీకేఆర్ వీఎండ్‌బీ వనసమారాధనలో యాదవ సంఘం ప్రముఖులకు సత్కారం

ఘనంగా వనసమారాధనలు

గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా నియోజకవర్గంలో కార్తీక వనసమారాధనలు సందడిగా జరిగాయి. వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో సోమవారం నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యాదవ ప్రముఖులను సత్కరించారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న యాదవ సంఘీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **పామర్రు :** పట్టణంలోని 13వ వార్డులోని కోదండరామాలయం వద్ద కార్తీక వన సమారాధన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కమ్మిలి నాగ అనిల్, జాహ్నవి దంపతులు ఉసిరి చెట్టు వద్ద పూజలు జరిపారు. కోటి వత్తులతో దీపారాధ చేశారు. భక్తన మాజం గీతాపారాయణంతోపాటు అయ్యప్పస్వాముల భజన సంకీర్తన జరిపారు. కుల మతాలకు అతీతంగా విచ్చేసి సహపంక్తి బోజనాలు చేశారు. ఏర్పాట్లను కలకొండ అంజిబాబు,అల్లంశెట్టి సురేష్, చొప్పకట్ల రమేష్, సిద్దంశెట్టి ముక్కఅంజనేయులు, దానరి కొండా, శ్రీపతికృష్ణ, కమ్మిలి సాంబయ్య మాగంటి నాని పర్యవేక్షించారు.

పశు వైద్యశాఖ ఉద్యోగి కన్పించడం లేదని ఫిర్యాదు

తోట్లవల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెనమకూరు పశువైద్యశాలలో వెటర్నరి లైవ్ స్టాక్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కురకుల వెంకటేశ్వరరావు (61) కన్పించడం లేదని సోమవారం భార్య సూర్యకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉదయం డ్యూటీకి వెళుతున్నట్టు చెప్పి సెల్‌ఫోన్ ఇంటివద్ద వదిలి బైక్‌పై వెళ్లాడని పేర్కొంది. సాయంత్రం వరకు ఇంటికి రాలేదని భార్య ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అర్జునరాజు తెలిపారు.

ఎల్‌పీ నంబర్లు కేటాయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

పమిడిముక్కల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గోపువానిపాలెంలో చెర వులు, పత్తేలంక వక్ఫ్ భూములకు ఎల్‌పీ నంబర్లు కేటాయించిన తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. గోపువాని పాలెంలో సర్వే నంబరు 30లో 9 ఎకరాల 88 సెంట్లు, వల్లభు ని చెరువు, 93 సర్వే నంబరులో 4 ఎకరాల 44 సెంట్లు పట్టాభిరా ముదు చెరువు పది మంది రైతుల పేర్లతో ఎల్‌పి నంబరు కేటాయింపు, పత్తేలంకలో వివిధ సర్వే నంబర్లలోని 32 ఎకరాల 69 సెంట్లు మసీదు మాన్యం భూములు జగనన్న రీ సర్వేలో ఎల్‌పీ నంబర్లు కేటాయించిన వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు.



బోరు పంపుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గురుమూర్తి, శివశంకర్

బోరు పంపులకు భూమిపూజ

తోట్లవల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బొడ్డపాడులో రూ 2.40 లక్షలతో చేపట్టిన రెండు తాగునీటి బోరు పంపుల నిర్మాణానికి సోమవారం రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మూడే శివ శంకర్, మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ సీతారాంబాబు, పాల కేంద్రం అధ్యక్షుడు వసంతకుమార్, కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, గురుమూర్తి

ధాన్యం విక్రయాల్లో రైతన్నకు స్వేచ్ఛ

కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పండించిన ధాన్యాన్ని ఎవ్వరికైనా ఎక్కడైనా విక్రయించుకునే స్వేచ్ఛను ప్రభుత్వం కల్పిస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. తోట్లవల్లూరులో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. బస్తాకు రూ 1,740 ధరను ప్రభుత్వం నిర్ణయించిందని, అంతకంటే ఎక్కువ ధర వస్తే ఎక్కడైనా అమ్ముకోవచ్చని రైతులకు సూచించారు. తక్కువ ధరకు మాత్రం అమ్మి నష్టపోవద్దన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వాట్సప్ యాప్‌లో తెలియజేయవచ్చన్నారు. అన్నదాతలను అధికారులు గౌరవించి తగిన సమాధానం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు జవాబుదారిగా ఉండటమే తన కర్తవ్యమన్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, తహసీల్దార్ ఎం కుసుమకుమారి పలువురు అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో రహదారి నిర్మాణ పనులకు పూజలో రావి, కొసరాజు

రహదారి పనులకు శంకుస్థాపన

గుడ్లవల్లేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో నరేగా నిధులతో నిర్మించే సీసీ రహదారి పనులకు సోమవారం రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడే కొసరాజు బాపయ్య చౌదరి, జంగం మోహనరావు, పొట్లూరి రవికుమార్, చాపరాల బాలాజీ, ఎ.రామ్మోహనరావు, పోలవరపు వెంకటరావు, వెంకటేశ్వరరావు, చాపరాల రాజేశ్వరరావు, ఈడే మోహన్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ప్రిన్సిపాల్,పీడీ తదితరులు

కబడ్డీలో జీఈసీ విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ అంతర్ కళాశాల కబడ్డీ పోటీల్లో జీఈసీ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. విజేతలైన విద్యార్థిలను, శిక్షణనిచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు ఎం. శివశంకర్, వెంకటేష్, పూజితలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, ఎంఆర్ సిహెచ్ శాస్త్రి తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పెడసనగల్లు విద్యార్థులు



కూచిపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు పెడసనగల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పిడి నాగశివ తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్ జాతీయ స్థాయి పోటీలకు ఆరేపల్లి దుర్గారావు ఎంపిక కాగా, రాజులపాటి మౌనిక త్రోబాల్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు హెచ్ఎం కె.శిరీష, పీడీ నాగశివ, పాఠశాల విద్యాకుటుంబం అభినందనలు తెలిపారు.



గ్రామీణ చిత్రపటం వద్ద వ్యవసాయ కళాశాల విద్యార్థులు, శాస్త్రవేత్తలు

కాజలో పంటల సాగుపై అవగాహన

కూచిపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు కాజ గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధిక దిగుబడుల సాధన, తెగుళ్ల నివారణ, వ్యవసాయంలో మెలకువల అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సాగవుతున్న పంటలు, భౌగోళిక విస్తీర్ణం, జనాభా అంశాలపై గ్రామీణ చిత్రపటాన్ని రంగవల్లుల రూపంలో చిత్రీకరించారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ నవీన్, ప్రకృతి వ్యవసాయ నిపుణులు పేకేటి సీతారామిరెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు బృహతి, లక్ష్మీశ్రీజ, మానస, నిహారిక, నాగజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

పెదపారుపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ-విజయవాడ రహదారి అధ్వాన్నంగా మారడటంతో పెదపారుపూడి మార్గంలో యలమర్రు, చినపారుపూడి వంతెన కుంగి ప్రమాదకరంగా తయారైంది. మార్గం మధ్యలో స్తంభాలను పాతుతున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆర్ అండ్ బి సిబ్బంది తెలిపారు. ఈదురుమద్దాలి చంద్రయ్య కాలువ వంతెన వద్ద ద్విచక్ర వాహనం వెళ్లే విధంగా రోడ్డుపై స్తంభాలు పాతారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో క్విజ్, వక్తృత్వ పోటీలు



మొవ్వ శాఖ గ్రంథాలయంలో వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో గ్రంథాలయాధికారి కృష్ణకుమారి

గుడివాడ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా షాగులాల్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు. **కూచిపూడి :** గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మొవ్వ శాఖా గ్రంథాలయంలో క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి కృష్ణకుమారి పర్యవేక్షించారు. **పామర్రు :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. లైబ్రేరియన్ ఎం.ఝాన్సీలక్ష్మి విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. జమీగోల్వేపల్లి గ్రంథాలయంలో లైబ్రేరియన్ వి.సురేష్ ఆటలు పోటీలను నిర్వహించారు. **పెదపారుపూడి :** వెంట్రప్రగడ శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు, నీటి సంరక్షణపై చర్చ, సాంకేతిక విద్య ప్రాముఖ్యతపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో పిల్లలకు కబడ్డీ, వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ శాఖాధికారి రహీం ఏర్పాట్లు పర్యవేక్షించారు. యలమర్రు గ్రంథాలయంలో అధికారిణి విజయలక్ష్మి, పెదపారుపూడి గ్రంథాలయ అధికారిణి ఎం.వి.ఎస్.లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.575

మోటమర్రి శ్రీదేవికి మంత్రి రవీంద్ర, కొనకళ్ల నివాళి



మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ సతీమణి శ్రీదేవి మృతి బాధాకరమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శ్రీదేవి సంతాప సభలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ బీసీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య తదితరులు పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. పల్లపాటి సుబ్రహ్మణ్యం, సీతారామయ్య, ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, అజీమ్, పి.వి.ఫణికుమార్ పాల్గొన్నారు.

కోలాహలంగా వనభోజనాలు



బీచ్‌లో యాత్రికులకు కార్తీక వనసమారాధన



నడకుదురులో వనభోజనాలు చేస్తున్న టీడీపీ నేతలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా మంగినపూడి బీచ్‌లో సముద్ర స్నానానికి వచ్చిన యాత్రికులకు సోమవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. బీచ్‌లోని చలమలశెట్టి నాంచారయ్య వనంలో పెద్ద సంఖ్యలో యాత్రికులకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. మూడు తరాలుగా చలమలశెట్టి నాంచారయ్య వారసులు వనభోజనాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని వెంకట సుబ్బయ్య, శివశ్రీ నిర్వహించారు. **చల్లపల్లి :** పృథ్వీశ్వర క్షేత్రాన్ని దర్శించుకోవటం ఎంతో అదృష్టమని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. నడకుదురులోని శ్రీబాలా పార్వతీ సమేత పృథ్వీశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక వనసమారాధన వేడుకలు జరిగాయి. నాదెళ్ల వారిపాలెం పృథ్వీశ్వర భక్తసమాజం(మహిళా మండలి) ఆధ్వర్యంలో భారీ కార్తీక వనసమారాధన ఏర్పాటుచేయగా, కనపర్తి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ ప్రముఖులు, వందలాది భక్తులు వనభోజనాల్లో పాల్గొన్నారు. నాదెళ్ల వెంకట నరసయ్య, యార్లగడ్డ శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వడ్లమూడి గోపీచంద్, నాదెళ్ల ప్రభాకరరావు, కాకర్ల లైలాదేవి, పరుచూరి సురేష్, గుత్తికొండ వంశీకృష్ణ, పరిశె మౌళి, మోర్ల శివ, షేక్ నబీఘోరి పాల్గొన్నారు. దేవదాయశాఖ ఈవో యార్లగడ్డ వాసు ఆధ్వర్యంలో దేవాలయ సమగ్ర అభివృద్ధి దాత మండవ రవీంద్ర సహకారంతో ఏర్పాట్లు చేశారు. **పెడన :** గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో తరలివచ్చి మహిమాన్వితుడైన అగస్త్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో టి.వి.వి. మోహనరావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్‌ల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకుడు గూడూరు అగస్త్యయ్య ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపారాధనలు చేశారు. ఉపాధ్యాయుడు ఊటుకూరి సుబ్బారావు భక్తులకు పవిత్ర కైలాస తీర్థం పంపిణీ చేశారు. **నాగాయలంక** శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్‌లోని కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. కార్తీక దీపాలను వెలిగించి నదిలోకి వదిలారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, సభ్యులు ఉప్పల బుజ్జి, బోయపాటి రాము పర్యవేక్షించారు.

సీఎం చంద్రబాబు ప్రారంభించారు.. అధికారులు ఉదాసీనంగా వదిలేశారు!

● బందరు సుందరీకరణ పనులకు ఆదిలోనే హంసపాదు



గోడలకు రంగు వేసి సుందరీకరణ పనులు ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు(ఫైల్)

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మచిలీపట్నంలో సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. సుందరీకరణ పనుల్లో భాగంగా సీఎం చంద్రబాబు కోనేరుసెంటర్‌లో డివైడర్ల గోడలకు రంగులు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పనులు చేపట్టి 46 రోజులయినా కొనసాగించడం లేదు. నిధులు కేటాయించడం, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంలో మునిసిపల్ అధికారులు జాప్యం చేయడంతో పనులు ముందుకు సాగలేదు. ఈ విషయమై కమిషనర్ బాపిరాజును వివరణ కోరగా, త్వరలో నిధులు కేటాయించి సుందరీకరణ పనులను చేపట్టి పూర్తి చేస్తామన్నారు.

వైసీపీ వైఫల్యాలతోనే ఫిల్టర్‌బెడ్ నిండా మురుగు

● టీడీపీ నేత గోపీచంద్, కార్పొరేటర్ల ధ్వజం



ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న గోపీచంద్, కార్పొరేటర్లు నాగరాము తదితరులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల వల్లే ప్రజలకు తాగునీరందించే ఫిల్టర్ బెడ్ నిండా పెద్ద ఎత్తున మురుగు చేరిందని టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ ధ్వజమెత్తారు. గోపీచంద్‌తో పాటు టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత హెడ్ వాటర్ వర్క్స్‌లోని ఫిల్టర్‌బెడ్‌లను, అమృతస్కీమ్‌లోని ఫిల్టర్‌బెడ్‌లను సందర్శించారు. కుళాయిల్లో మురుగునీరు వస్తోందని మంత్రి కొల్లు రవీంద్రకు ప్రజాదర్బార్‌లో ఫిర్యాదులు అందాయన్నారు, మంత్రి వాస్తవాలను విచారించగా ఫిల్టర్‌బెడ్‌లో మురుగు, మట్టి పేరుకుపోయిందని తేలిందన్నారు. మరో రెండు రోజుల్లో హెడ్ వాటర్ వర్క్స్ వద్ద మురుగు తొలగింపు పూర్తవుతుందన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సముద్రపు ఉప్పునీటి ముంపు బాధిత రైతులు

నష్టపరిహారం అందించి ఆదుకోవాలి

కోడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సముద్రపు ఉప్పునీటి ముంపునకు గురై నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కోడూరు ఈస్ట్ ఛానల్ 13, 14, 15, 16, 17, 18 కాలువల కింద ఉప్పునీటి ముంపునకు గురై నష్టపోయిన రైతులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ బిశ్రీను నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా సుమారు నాలుగు వేల ఎకరాల్లో నాట్లు వేసి నష్టపోయామని తెలిపారు. ఈ సంవత్సరం రెండుసార్లు నారుమడులు పోసి, నాట్లు వేశామని, ఇప్పటి వరకు ఎకరానికి రూ.15 వేల వరకు ఖర్చు పెట్టి నష్టపోయామన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. రైతు సంఘ నాయకులు ఆవుల బసవయ్య, రేపల్లె యోగ ప్రకాష్, రైతులు ఉల్లి రంగారావు, అడుసుమిల్లి సాయిబాబు, మల్లా వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ లాజర్, కొక్కిలిగడ్డ జ్యోతి, కంచర్లపల్లి సుధాకర్, గురువుశెట్టి శ్రీనివాసరావు, అడుసుమిల్లి సత్యనారాయణ, వీరంకి వెంకన్న, చేబోయిన శ్రీనివాసరావు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కె.కొత్తపాలెం వద్ద కృష్ణానదిలో ఎడ్ల బండ్లతో అక్రమంగా ఇసుక రవాణా

కె.కొత్తపాలెంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

మోపిదేవి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏ విధమైన అనుమతులు లేకుండా కె.కొత్తపాలెంలోని కృష్ణానది నుంచి పదుల సంఖ్యలో ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో కృష్ణానదిలోకి వెళ్లి నీటి నుంచి ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. మోపిదేవి, చల్లపల్లి తదితర ప్రాంతాల ఎద్దుల బండ్ల ద్వారా రవాణా చేసి అమ్మకాలు చేపడుతున్నారు. నదీ తీర గ్రామాలు సీఆర్‌జెడ్ పరిధిలో ఉండగా, నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోకపోవటంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై సమాచారం అందించినప్పటికీ రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే మండలి హెచ్చరికలను సైతం ధిక్కరిస్తుండటంతో అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ శ్రీవిద్యను వివరణ కోరగా, కె.కొత్తపాలెంలో ఇసుక అక్రమ తవ్వకాలు నిరోధించేందుకు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

రూ.2.75 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు మార్కింగ్ చేస్తున్న దేవదాయశాఖ అధికారులు

మోపిదేవి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో రూ.2.75 కోట్ల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్, భక్తుల విశ్రాంతి గదులు నిర్మించనున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. దేవదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం ఉదయం నిర్మాణ పనులు చేపట్టనున్న స్థలాన్ని పరిశీలించారు. దేవస్థానానికి చెందిన చెరువు వద్ద గదులు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు సంబంధించి మార్కింగ్ నిర్వహిం చారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పది దుకాణాలు, భక్తుల సౌకర్యార్థం 20 గదులు నిర్మించనున్నట్లు తెలిపారు. మొదటి, రెండు అంతస్థుల్లో లిఫ్ట్ సౌకర్యంతో సంవత్సర కాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. దేవదాయశాఖ డీఈ గోపాలకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సై సుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేస్తున్న మీడియా ప్రతినిధులు

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి

చల్లపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దౌర్జన్యానికి పాల్పడిన ఇసుక మాఫియాపై చర్యలు తీసుకుని బాధ్యులను శిక్షించాలని కోరుతూ నియోజకవర్గ జర్నలిస్టులు సోమవారం చల్లపల్లి ఎస్సై పి.సుబ్రహ్మణ్యంకు ఫిర్యాదు చేశారు. వెలివోలులో ఇసుక డంపింగ్ చేస్తున్న దృశ్యాలను ఫొటోతీసిన జర్నలిస్ట్ కుంపటి బాబూరావు ఇంటికి ఆదివారం రాత్రి ఇసుకమాఫియా వచ్చి దుర్భాషలాడారని తెలిపారు. దౌర్జన్యం చేసిన కుంపటి బసవయ్య, కుంపటి కృష్ణారావులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వినతిపత్రంలో కోరారు. చల్లపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పేరం మధుసూదన రెడ్డి, షేక్ ఎజాజ్ అహ్మద్, జర్నలిస్టు సంఘం నేతలు సుధీర్ బాబు, ఇమ్మిడిశెట్టి వెంకట్, బాసు లంకబాబు, శ్రీనివాసరావు, హరిప్రసాద్, బీడీఆర్.ప్రసాద్, తులసీరామ్, మీర్ రిజ్వాన్, మహమ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చల్లపల్లి ఎస్సై పి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

రామకృష్ణరాజుకు ఎమ్మెల్యే కాగిత పరామర్శ



పెడన రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బల్లిపర్రు గ్రామానికి చెందిన ముదునూరు రామకృష్ణరాజు వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కోతమిషన్‌లో పడి కుడిచేయి తెగి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. విషయం తెలుసుకున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్‌తో కలిసి వెళ్లి రామకృష్ణరాజును పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్

మితిమీరిన వేగంతో అనర్థాలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మితిమీరిన వేగం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని ట్రాఫిక్ సీఐ ఏ.వి.శివకుమార్ అన్నారు. మచిలీపట్నం లేడీయాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపరాదన్నారు. సుదూర ప్రాంతానికి వెళ్లే వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇటీవల రోడ్ల పక్కన పార్కింగ్ చేసే కార్ల డోర్లు తీసి ఉంచుతున్నారని, దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ విబో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 24న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో నిర్వహించే ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. సోమవారం మంత్రి కార్యాలయంలో విబో ఆసుపత్రి వైద్యశిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. డాక్టర్ బొబ్బూరి విరజ, ఆసుపత్రి డైరెక్టర్ బొబ్బూరి వెంకట్రావు, మేనేజర్ శ్రవణం శివరామకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మోపిదేవి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలైన సంఘటన మోపిదేవి శివారులో సోమవారం రాత్రి జరిగింది. కొక్కిలిగడ్డ వెళ్లే అడ్డ రోడ్డు సమీపంలో మోపిదేవి రూరల్ ఎల్‌ఐగా పని చేస్తున్న అన్నవరపు వెంకటేశ్వరరావు రోడ్డు దాటుండగా మోపిదేవిలంకకు బైక్‌పై వస్తూ ఢీకొట్టాడు. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఒకరిని చల్లపల్లి ప్రైవేట్ హాస్పటల్‌కు, మరొకరిని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.. ఎస్సై సత్యనారాయణ కేసు చేస్తున్నారు.



బాధిత కుటుంబాలకు వేదవ్యాస్ పరామర్శ

మచిలీపట్నం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెదపట్నం గొల్లగూడెం గ్రామానికి చెందిన నాయకుడు మాగంటి రామచంద్రరావు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ సోమవారం పరామర్శించారు. **పెడన రూరల్ :** చెన్నూరు ఉపసర్పంచ్ యర్రంశెట్టి వీర కస్తూర్బాయి (బేబమ్మ) భర్త యర్రంశెట్టి శేషగిరిరావు మరణించటంతో బేబమ్మను, అల్లుడు చందు అమరేశ్వరరావు, కుటుంబసభ్యులను వేదవ్యాస్ సోమవారం పరామర్శించారు. శేషగిరిరావు చిత్రపటానికి నివాళులర్పించారు. యర్రంశెట్టి శివ, రక్కీస కామేశ్వరరావు, చెన్నూరు శేఖర్, యర్రంశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యఘర్‌పై అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.సత్యానందం

సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

చల్లపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సౌరవిద్యుత్ వాడకం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి చైతన్య పరచాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం.సత్యానందం అన్నారు. చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సోమవారం ఉయ్యూరు డివిజన్ జేఎల్ఎంలకు సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఈ సత్యానందం మాట్లాడుతూ, సౌర విద్యుత్ వాడటం వల్ల వినియోగదారులకు మూడు లాభాలున్నాయన్నారు. సౌర పలకలు అమరిక ఖర్చుపై ప్రభుత్వ రాయితీ, విద్యుత్ బిల్లులు తగ్గింపు, మిగులు విద్యుత్ అమ్మకంతో ఆదాయం పొందవచ్చన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం వల్ల కలిగే లాభాలను వివరించి సౌరవిద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ, తాము నాటిన మొక్కలను విద్యుత్ శాఖ సిబ్బంది నరికివేస్తున్నారని తెలిపారు. నరికిన కొమ్మలను అలాగే వదిలివేస్తున్నారనీ, ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించాలని ఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లారు. ఉయ్యూరు ఈఈ డి.కృష్ణానాయక్, కృష్ణా ఏవో(ఫైనాన్స్) బి.వెంకటేశ్వరరావు, చల్లపల్లి ఏడీఈ పులి శివనాగేశ్వరరావు, స్థానిక విద్యుత్ శాఖ అధికారులు, జేఎల్ఎంలు పాల్గొన్నారు.